# హైదరాబాద్ వార్త



# ఖర్చులెలా.. తగ్గించుకుందాం

- మార్కెట్ కమిటీల మదనం
- మురిగి పోయిన కూరగాయలతో విద్యుత్ ఉత్పత్తి
- రూ. 3 కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు




బోయిన్‌పల్లి మార్కెట్‌లో ముగిగిన కూరగాయలతో విద్యుత్ ఉత్పత్తి

హైదరాబాద్ ఆగస్టు 8 ప్రభాతవార్త : ఏటా అవుతున్న ఖర్చులను భారీగా తగ్గించుకుని ఆదాయం పెంచుకునేందుకు పలు మార్కెటింగ్ కమిటీలు తమ వంతుగా ప్రయత్నాలు చేస్తున్నాయి. తద్వారా వచ్చిన ఆదాయాన్ని మార్కెట్‌లో మౌలిక వసతుల కల్ప నను కృషి చేయడమే కాకుండా ఇతర మార్కె ట్‌లకు ఆదర్శంగా నిలిచేందుకు కృషి చేస్తున్నాయి. ఇలా ప్రభుత్వానికి ఆదయం సమకూర్చేందుకు గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు మార్కెట్‌లు పోటీ పడుతున్నాయి. ఇందులో భాగంగా ఏఏ వాటికి అధిక ఖర్చులు వస్తున్నాయి, వాటిని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయాలు ఏంటీ అని ఆలోచిస్తున్నాయి. ముఖ్యంగా కూరగాయల మార్కెట్లకు సంబంధించిన వ్యవసాయ మార్కెట్ కమిటీలలో అత్యధికంగా ప్రతి ఏటా విద్యుత్ వినియోగం కోసమే అధిక మొత్తంలో వెచ్చిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగు వ్యవసాయ మార్కెట్‌లు ఉన్నాయి. ఇందులో 1. హైదరాబాద్ మలక్‌పేట మార్కెట్ 2 గడ్డి అన్నారం మార్కెట్ ( ఇటీవలే బాట సింగారంకు మారింది), 3. గుడిమల్కాపూర్ మార్కెట్ 4. బోయిన్ పల్లి వ్యవసాయ మార్కెట్. ఈ మార్కెట్లన్నీ కూడా కరెంటు లేకుండా ముందుకు వెళ్లలేని పరి స్థితి ఉండడంతో అనివార్యంగానే కరెంటు బిల్లులను నెలా నెలా లక్షల్లోనే కట్టాల్సి వస్తోంది. ఈ క్రమంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించగా వారికి బయోగ్యాస్ ప్లాంట్ లేదా సోలార్ విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కనిపిస్తోంది. ఇందులో సోలార్ కంటే కూడా బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటేనో ? అది కూడా మురిగి పోయిన కూరగాయలను వినియోగించే చేసుకోవచ్చా?? అన్న ఆలోచన చేసిన మార్కెటింగ్ కమిటీలు ఎట్టకేలకు బయోగ్యాస్ ప్లాంట్ దిశగానే మొగ్గ చూపుతున్నాయి. బోయిన్‌పల్లి మార్కెట్‌లో బయోగ్యాస్ ప్లాంట్ ఇతర మార్కెట్లలో విద్యుత్ వినియోగం ఎలా ఉందో తెలుసుకుంటూనే కరెంటు బిల్లులను తగ్గించుకునేందుకు బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ అధికారులు బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టి సత్ఫలితాలను చవి చూస్తున్నారు. బయోగ్యాస్ ప్లాంట్ లేనప్పుడు బోయిన్‌పల్లి మార్కెట్ ఏటా రూ. 3 లక్షల 50 వేల రూపాయలను కట్టేది. ప్రస్తుతం బయోగ్యాస్ ప్లాంట్ సమకూరడంతో కేవలం రూ. 1.54 లక్షలను మాత్రమే కడుతున్నారు. ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటి నుండి విజిటేబుల్ వేస్టేజ్ కూరగాయలు 4908 మెట్రిక్ టన్నుల కూరగాయల వ్యర్థాలను కలెక్ట్ చేసి ప్లాంట్‌లో వినియోగించడం ద్వారా ఒక లక్ష్యా 52 వేల 236 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. విద్యుత్ ఉత్పత్తితో పాటు 8901.05 కేజీల ఎస్‌పిజి గ్యాస్ కూడా ఉత్పత్తి అవుతోంది.

**తగ్గిన వ్యయం పెరిగిన ఆదాయం..** బోయిన్‌పల్లి మార్కెట్‌లో మార్కెట్ వ్యయం తగ్గి ఆదాయం కూడా పెరిగింది. బోయిన్ పల్లి మార్కెట్ పరిధిలో కూ కట్‌పల్లి, ఎల్లమ్మ బండ, ఆర్ కే పురం, అల్వాల్ రైతుబజార్లు ఉంటాయి. ఇంతకుముందు ఆయా మార్కెట్ల నుండి వ్యర్థాలను జవహర్ నగర్, బాలీజీ నగర్‌లకు తరలించేవారు. ఆయా మార్కెట్లను అభివృద్ధి పరుస్తూనే బయోగ్యాస్ ప్లాంట్ వినియోగం ద్వారా ఆదాయాన్ని భారీగా సమకూర్చు కోగ లిగింది. ఉదా.. గత 2022 - 2023 ఫైనాన్సియల్ ఇయర్‌నే తీసుకుంటే మార్కెట్ కమిటీకి రూ. 4 కోట్ల 86 లక్షల 39 వేల రూపాయల ఆదాయం లభించింది.

బయోగ్యాస్ ప్లాంటా? దాని నుండి విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలంటే ముడి సరుకుగా ఏం వాడాలి? గతంలో పశువుల పేడతోనూ గోబర్ గ్యాస్ ఉత్పత్తి చేసుకున్నట్లు కూరగాయల మార్కెట్లో వినియోగం కాగా మిగిలిన కూరగాయలు మురిగి పోతుంటేవాటిని ఎందుకు వినియోగించుకోరాదూ !! అనే ఆలోచన చేసిన బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి అదే దిశగా చర్యలు

## బోయిన్‌పల్లిలో 3 కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు

తీసుకుంది. డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ జి. లక్ష్మీబాయి ఆలోచనల మేరకు డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కూరగాయల మార్కెట్ యార్డు బోయిన్‌పల్లి (సికింద్రా బాద్) అధికారులు మార్కెట్ కమిటీ ప్రాంగణంలో బయోగ్యాస్ ప్లాంట్‌ను రూ. 3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసుకున్నారు. ఈ మొత్తంలో రూ. 2 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చగా మరో కోటి నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందని బోయిన్‌పల్లి మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ 'ప్రభాత వార్త' కు తెలిపారు. బయోగ్యాస్ ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్తును మార్కెట్ ప్రాంగణంలో స్ట్రీట్ లైట్స్ విద్యుత్ దీపాలకు, క్యాంటీన్‌కు, అలాగే తమ మార్కెట్ కార్యాలయానికి వినియోగించుకుంటున్నట్లు తెలిపారు.





# డెంగీ లేకున్నా..!

## సొమ్ము చేసుకుంటున్న ఆస్పత్రులు

**జ్వరం రాగానే వాడలిపోతున్న జనం**

**రోగులకు అవసరం లేకున్న ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్న వైనం**

**ఒక్కో రోగి నుంచి రూ.50 వేల నుంచి రూ.2 లక్షలు వసూలు**

హైదరాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త : కొన్నాళ్ళ క్రితం వరకు కరోనా బాధితులను పీల్చి పిప్పి చేసిన అనేక ప్రైవేటు ఆసుపత్రులు.. ఇప్పుడు డెంగీ రోగుల జేబులు గుల్ల చేస్తున్నాయి. తప్పుడు రిపోర్టుల్లో ప్లేట్‌లెట్ల సంఖ్యను తక్కువగా చూపిస్తున్నాయి. ప్లేట్‌లెట్లు అవసరం లేకపోయినా ఎక్కిస్తూ డబ్బులు గుంజుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసరంగా ఫీజులు వసూలు చేయొద్దని వైద్య ఆరోగ్యశాఖ పదేపదే చెబుతున్నా కొన్ని ఆసుపత్రులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రూ.50 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తూ రోగుల్ని ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులు అధిక ఫీజులు వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరుతూ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ రావు ప్రత్యేకంగా ఇచ్చిన వాట్సప్ నెంబర్ 9154170960 కు పలు ఫిర్యాదులు వస్తున్నాయని ఒక అధికారి తెలిపారు.

**పెరుగుతున్న డెంగీ కేసులు..** నగరంలో డెంగీ విజృంభించింది. కరోనా పరిస్థితుల్లో సాధారణ జ్వరం వస్తేనే ప్రజలు హడలిపోతున్నారు. జ్వరం రాగానే కరోనా పరీక్షలతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలన్నీ చేయించుకుంటున్నారు. అయితే మూడేళ్ళ తర్వాత ఈసారి డెంగీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వైద్య వర్గాలు వెల్లడించాయి. వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో ఎక్కువ కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ఇప్పటికే కిటకిటలాడుతున్నాయి. వర్షాలు తగ్గాక మరిన్ని కేసులు నమోదయ్యే ప్రమాదముందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. సాధారణంగా ఇతర అనారోగ్య సమస్యలు ఏమీ లేకపోతే ప్లేట్‌లెట్లు 20వేల వరకు తగ్గినా కంగారు పడాల్సిన అవసరం లేదు. అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు మాత్రం 50వేల లోపునకు తగ్గితే జాగ్రత్త వహించాలి. చాలా వరకు కేసుల్లో సాధారణ జ్వరానికి చేసే చికిత్సే చాలని వైద్య నిపుణులంటున్నారు.

**డెంగీ లేకున్నా..** అయితే డెంగీతో తమ వద్దకు వస్తున్న రోగుల వద్ద పలు ప్రైవేటు ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. రోగికి 50 వేలకు పైగా ప్లేట్‌లెట్లు ఉన్నా ఐసీయూలో ఉంచి అదనంగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. నాలుగైదు రోజులు ఉంచుకొని రూ.50వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టుగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఒకసారి ప్లేట్‌లెట్లు ఎక్కిస్తే రూ.12వేల నుంచి రూ.15వేల వరకు బిల్లు వేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సాధారణ విష జ్వరాలకు కూడా నాలుగైదు రోజులు ఆసుపత్రుల్లో ఉంచుకొని రూ.30 వేల నుంచి రూ. 50వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఒక డెంగీ ఉన్నా లేకున్నా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు డయాగ్నోస్టిక్ సెంటర్లు తప్పుడు రిపోర్టులు ఇస్తున్నాయని, ప్లేట్ లెట్లు ఎక్కువున్నా తక్కువ చేపిస్తున్నా యన్న ఫిర్యాదులు కూడా ప్రభుత్వానికి అందడం గమనార్హం. డెంగీ లేకపోయినా ప్లేట్‌లెట్ల కౌంట్ సరిపడా ఉన్నప్పటికీ ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**తీవ్రతను తగ్గించడం ఎలా..** డెంగీ జ్వరం వస్తే తీవ్రతను తగ్గించేందుకు చల్లని నీటిలో స్పాంజిని ముంచి రోగి శరీరాన్ని తుడవాలి. కాచి వడపోసిన నీటినే తాగాలి. ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీళ్ల, పళ్ళరసాలు ఇవ్వాలి. దీని వల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్లు తగ్గడం అదుపులోకి వస్తుంది. రానిపక్షంలో వైద్యుని వద్దకు తీసుకువెళ్ళాలి. డెంగీకి గురైతే ఉన్నట్టుండి తీవ్రమైన జ్వరం భరించలేని తలనొప్పి వస్తుంది. కళ్ళు తెరవడం కష్టంగా ఉంటుంది. చర్మంపై దద్దుర్లు కనిపిస్తాయి. కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయి. వీటితో పాటు అధిక దాహం, రక్తపోటు పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో డెంగీ నిర్ధారించుకోవడానికి వైద్య పరీక్షలే కీలకం. కేవలం ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ వంటి వాటితో దీనిని నిర్ధారించడం శాస్త్రీయం కాదని వైద్య, ఆరోగ్యశాఖ చెబుతోంది. విధిగా ఐజీఎం పరీక్ష చేయించాలి. ప్లేట్‌లెట్లు 20 వేలలోపు పడిపోతే అది ప్రమాదకరం. 15 వేల కన్నా తగ్గితే డెంగీ షాక్, డెంగీ మరణాలు సంభవిస్తాయి.

**రక్తస్రావం జరిగితే ప్రమాదకరం : ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్**



డెంగీని ముందుగా గుర్తిస్తే 80 శాతం వరకు ఎటువంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చు. ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చు. కానీ కొందరికి తీవ్రమైన రక్తస్రావం అవుతుంది. ముక్కు నుంచి కానీ, మలం ద్వారా కానీ, బ్రష్ చేసేటప్పుడు పళ్ల మధ్య నుంచి రక్తస్రావం అవుతుంది. ఇలా అధికంగా రక్తస్రావం అయితేనే ప్రమాదకరం. అలాగే మహిళలకు పీరియడ్స్ సమయంలో సాధారణ రక్తస్రావం కంటే ఎక్కువగా అయ్యే అవకాశం ఉంటుంది. దాన్ని వాళ్ళు గుర్తించాలి. అలాంటి సమయాల్లో ప్లేట్‌లెట్ల సంఖ్య 50 వేలున్నా సరే తప్పనిసరిగా ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి ఉంటుంది. రక్తస్రావం లేనప్పుడు 20 వేల వరకు పడిపోయినా ప్రమాదం ఉండదు. ప్రత్యేకంగా ప్లేట్‌లెట్లు ఎక్కించి రోగిని సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

బంజారాహిల్స్‌లో దారుణం

## యువతిని గదిలో బంధించి అత్యాచారం

హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త: బంజారాహిల్స్‌లో దారుణం జరిగింది. ఓయువతిని గదిలో బంధించిన యువకుడు, ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈనెల 4న జరిగిన ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం బంజారాహిల్స్‌లోని ఓ బస్తీకి చెందిన యువతిని ఆదే ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న యువకుడు చిన్మయి సైక్యా (22)తో పరిచయం ఏర్పడింది. ఈనెల 4న యువతి ఇంటికి వెళ్లిన యువకుడు ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని గదిలో బంధించి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం బయటపెడితే చంపేస్తానని హెచ్చరించాడు. అయితే ఈ ఘటనతో తీవ్ర మనస్థాపం చెందిన యువతి తనకు చనిపోవాలని ఉందంటూ స్నేహితురాలికి మెసేజ్ చేసింది. అది చూసిన ఆమె వెంటనే బాధితురాలి సోదరికి చెప్పడంతో ఆమె అప్రమత్తమైంది. ఆరా తీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది.

## డీజిల్ పేరుతో 12లక్షలు మోసం

### క్యాషియర్‌పై కేసు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త: నిధులను దుర్వినియోగానికి పాల్పడిన జూబ్లీహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో క్యాషియర్ మీద చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. అన్నపూర్ణ స్టూడియోస్‌లో భరత్‌మణి (34) అనేవ్యక్తి ఆరేళ్లుగా క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరిగే టివి సీరియల్స్ షూటింగ్, ఓటిటి ప్రసారమయ్యే వెబ్‌సిరీస్‌లకు సంబంధించిన షూటింగ్స్‌కు చెందిన లావాదేవీలు భరత్‌మణి చూస్తుంటారు. రోజువారీగా వచ్చే ఆదాయంతో పాటు నిర్వాహణ ఖర్చులు, చెల్లింపులు చేస్తుంటారు. కాగా భరత్ ఇటీవల రూ.30వేలను డీజిల్ బిల్లు వచ్చినట్లు లెక్కల్లో చూపించారు. అయితే ఆ డబ్బులను తీసుకున్నట్లు గుర్తించిన సంస్థ యాజమాన్యం డీజిల్‌కు సంబంధించిన బిల్లులపై ఆడిటింగ్ నిర్వహించింది. డీజిల్ పేరుతో సుమారు రూ.12లక్షల మేర మోసానికి పాల్పడ్డట్లు తేలడంతో అన్నపూర్ణ స్టూడియోస్ ఆపరేషన్స్ జీఎం అన్నే చిరంజీవి గీతాధర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా .. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పనికి వెళ్తూ.. మృతి చెందిన మున్సిపల్ కార్మికురాలు



మణికొండ మున్సిపల్ కార్మికురాలు బండి అనసూజ (పాతచిత్రం)

నార్సింగి, ఆగస్టు 8 ప్రభాతవార్త : పనికి వెళ్తూ మణికొండ మున్సిపల్ కార్మికురాలు బండి అనసూజ మృతి చెందింది. దీంతో తోటి కార్మికులంతా అనసూజ ఇంటికి వెళ్లి నివాళులు అర్పించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్ కుమార్ అనసూజ అంత్యక్రియల కోసం మున్సిపల్ తరపున రూ.10.వేలను అందజేశారు. అలాగే సీఐటియు మండల కార్యదర్శి రుద్రకుమార్ యాదవ్ నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మణికొండ మున్సిపల్ కార్మికులకు ఒక్కపూటనే పని చేయించుకోవాలని అనేకమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. బండ్లగూడ కార్పోరేషన్‌లో ఒక్కపూటనే కార్మికులు పని చేస్తున్నారని కానీ మణికొండలో మాత్రం రెండు పూటలు పనులు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. పని ఒత్తిడితో కార్మికులు ఆందోళన చెంది మృత్యువాతన పడుతున్నా అధికారులు తమ పంథాను వీడడం లేదన్నారు. ఒక్కపూట పనిని అమలు చేయకపోతే విధులు బహిష్కరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పక్క రాష్ట్రంలో కార్మికులు మృతి చెందితే రూ.2లక్షలు ఇస్తున్నారని, అదే రీతిన మన రాష్ట్రంలో పని చేస్తున్న కార్మికులకు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. కార్మికులందరికి రూ.21.వేల జీతాన్ని ఇస్తూ రెండు లక్షల ఇన్సూరెన్స్‌ను ఇవ్వాలని సిఐటియు నాయకుడు రుద్రకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## వీనులవిందుగా సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త: రాగమాధురి మ్యూజిక్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు, గాయకుడు ఎ.వి.పుల్లారావు, వ్యవస్థాపక కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన 307వ చిత్రగీతాల 'జనరంజనీ' అందరిని సంగీత సాగరంలో తేలియాడించింది. సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు ఎన్.శ్రీనివాసులు, కర్రా శ్రీనివాస్, కామేశ్, శ్రీనివాసచక్రవర్తి, వి.ఎ.లక్ష్మి, అఖిల, పల్లవి, రాగరేఖ తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## స్వాతంత్ర సమరయోధుల చరిత్ర తెలుసుకోవడం అవసరం

### తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్



సాలార్‌జంగ్ మ్యూజియంలో తెలుగు స్వాతంత్ర్య సమర యోధుల ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్

చార్మినార్, ఆగష్టు 8 ప్రభాతవార్త : ఇంటింటా మువ్వెన్నెల జెండా ఉత్సవాలలో భాగంగా సాలార్ జంగ్ మ్యూజియంలో సోమవారం సాయంత్రం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల ఛాయా చిత్ర ప్రదర్శనను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య అమృత మహోత్సవ వేడులకను ప్రజలు ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మన దేశ భక్తికి ప్రతీకగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆగష్టు నెల 13 నుంచి 15 వరకు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురు వేయాలని తెలంగాణ రాష్ట్ర పౌరులకు పిలుపు నిచ్చారు. భారత దేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం గల దేశమని అందుకు మనమంతా గర్వ పడాలని తెలిపారు. దేశ స్వాతంత్ర్య కోసం పోరాటం జరిపిన తెలుగు స్వాతంత్ర్య సమరయో ధులు, ముఖ్యంగా అజ్ఞాత స్వాతంత్ర్య వీరులను స్మరిం చుకోవటం ఈ సమయంలో ఎంతో అవసరమని గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్ తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చిన స్వాతంత్ర్య సమరయోధుల యొక్క చరిత్ర గురించి తెలుసుకోవటం ఎంతో అవసరమన్నారు. తెలుగు స్వాతంత్ర్య సమరయోధులైన అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య, మాడపాటి హనుమంతరావు, పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు, చిట్యాల ఐలమ్మ, బూర్గుల రామకృష్ణ, కుమరీం భీమ్, దాశరధి కృష్ణమాచార్యులు, వావిలాల గోపాల క్రిష్ణయ్య, ముగ్దుం మొహియుద్దీన్, సర్దార్ జమలాపురం కేశవరావు, స్వామి రామానంద తీర్థ, దుర్గా భాయి దేశ్‌ముఖ్, కాలోజీ నారాయణరావు, కొండా లక్ష్మణ్ బాపూజీ, సంగం లక్ష్మీబాయి, షాయుబుల్లా ఖాన్, నారాయణరావు పవార్‌తో పాటు పలువురు తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రకు సంబంధించిన చిత్రాలను ఫోటో ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ డైరెక్టర్ జనరల్ ఎస్.వెంకటేశ్వర్, సిబిసి న్యూఢిల్లీ అదనపు డైరెక్టర్ జనరల్ రంజనా దేవ్ శర్మ, సాలారాజంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి, డైరెక్టర్ పిబిఐ, సిబిసి శృతి పాటిల్, డిప్యూటీ డైరెక్టర్ కృష్ణకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్ హరిబాబు, సెంట్రల్ మ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారులు, బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీబాక్రీ పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్ పాతబస్తీలో

## 10వ మొహర్రం సామూహిక ఊరేగింపు

### ఊరేగింపు సందర్భంగా పటిష్టమైన పోలీస్ భద్రతా



నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ పాతబస్తీ డబీర్‌పుర లోని చారిత్రక బీబీకా అలావాను సందర్శించినప్పటి చిత్రం

చార్మినార్, ఆగష్టు 8 ప్రభాతవార్త : హైదరాబాద్ పాత బస్తీలో షియా ముస్లింలు మంగళవారం 10వ మొహర్రం సామూహిక ఊరేగింపును నిర్వహించనున్నారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ షియా ముస్లింలు పాతనగరంలోని పలు ప్రాంతాలలో మంగళవారం సామూహిక ఊరేగింపును జరపనున్నారు. డబీర్‌పుర, దారుషిఫా, నూర్‌ఖాన్ బజార్, బాల్‌శెట్టి ఖేత్, మీరాలంమండి, గుల్జారాహౌస్‌తోపాటు పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది షియా ముస్లింలు సామూహిక ఊరేగింపులో పాల్గొననున్నారు. కాగా డబీర్‌పురలోని బీబీ కాఅలవా నుంచి ప్రారంభమై ఊరేగింపు పాతబస్తీలోని ఎత్తెబార్ చౌక్, కోట్ల అలీజా, సర్దార్ మహల్, చార్‌కమాన్, గుల్జారాహౌస్, ఫంజేషా, ఎత్తెబార్‌చౌక్, మీరాలంమండి, దారుషిఫా, అజాఖానా జహరా ప్రాంతాలు మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగ నున్నది. మొహర్రంను పురస్కరించుకుని అంబారీతో పాతబస్తీలో జరగనున్న సామూహిక ఊరేగింపు సంద ర్భంగా దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ పాతబస్తీలోని చారిత్రక డబీర్‌పుర బీబీకా అలావాను సోమవారం సందర్శించి పూలు దట్టీలు సమరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం ఊరేగింపును పురస్కరించుకుని పాతబస్తీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కాగా ఇప్పటికే రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ మసియుల్లా ఖాన్, తెలంగాణ వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళతో పాటు పలువురు ప్రముఖులు బీబీకా ఆలంకు పూలు దట్టీలు సమర్పించారు.

## తప్పుడు సమాచారం.. తప్పుడు వార్తలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

### యుఎస్ కాన్సులేట్ జనరల్ అసిస్టెంట్ పబ్లిక్ అఫైర్స్ అధికారి ఫ్రంకీస్టర్మ్



పుష్పగుచ్చాన్ని అందజేస్తున్న విసి ప్రొ. రవీందర్ యాదవ్

తార్నాక, ఆగస్టు 8 ప్రభాతవార్త: తప్పుడు సమాచారం, తప్పుడు వార్తలు ప్రజాస్వామ్య పునాదులను పెకిలిస్తాయని యూఎస్ కాన్సులేట్ జనరల్ అసిస్టెంట్ పబ్లిక్ అఫైర్స్ అధికారి ఫ్రంకీస్టర్మ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీతో కలిసి నగరంలోని యూఎస్ కాన్సులేట్ జనరల్ ఓ.యూ సీఎప్ ఆర్డీతో ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొని మాట్లాడుతూ తప్పుడు సమాచారాన్ని కట్టడి చేయడంతో పాటు వాస్తవాలను ప్రజలకు అందించేందుకు జర్నలిస్టులు అదనపు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని హితవు పలికారు. వాస్తవిక సమాచార మార్పిడి జరిగేలా వాతావరణాన్ని ఏర్పాటు చేయడం ద్వార ప్రజాస్వామ్య మూలాలను మరింత మెరుగుపరుచవచ్చాన్నారు. నఖిలీ వార్తలు, తప్పుడు సమాచారం వ్యాప్తిపై విస్తృత చర్చ జరుగాల్సిన అవసరం ఉందన్నారు. దృవీకరణ లేని వార్తలు సంస్థలను, వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీస్తాయని ఓ.యూ వైస్ చాన్సలర్ డి. రవీందర్ పేర్కొన్నారు. వార్తలను ప్రజాబాహుళ్యంలో వ్యాప్తి చేసేముందు ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని, సంబందిత వ్యక్తుల నుంచి వివరణ తీసుకోవాలని సూచించారు. మీడియా సంస్థలు ఎల్లప్పుడు న్యాయంగా, సమతుల్యతతో పనిచేయాలని అప్పుడే వారికి సైతం గుర్తింపు లభిస్తుందని చెప్పారు. తెలుగు జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చేందుకు వందేళ్ల చరిత్ర కలిగిన ఓ.యూ యూఎస్ కాన్సులేట్ ఎంచుకున్నందుకు వీసీ కృతజ్ఞులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓ.యూ జర్నలిజం విభాగాధిపతి ప్రొ. స్టీవెన్‌సన్ కోహిర్, ఫ్యాక్ట్ చెక్ శిక్షకులు ఉడుముల సుధాకర్‌రెడ్డి, కొరినా సురేష్, ప్రాజెక్టు సభ్యులు ఎస్.రాము, అబ్దుల్ బాసిత్‌తో పాటు జర్నలిజం విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



హెచ్ఐసిసిలో జరిగిన భారత స్వాతంత్ర దినోత్సవ వజ్రోత్సవ వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. (ఇన్‌సెట్‌లో) వేడుకల్లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్

ఘనంగా వజ్రోత్సవ వేడుకలు

## ఖైరతాబాద్‌లో మొహర్రంకు అంతా సిద్ధం

**ఖైరతాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** మొహర్రం పండుగ సందర్భంగా అంతా సిద్ధం చేస్తున్నట్లు పలువురు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రధానంగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధి బస్తీల, కాలనీలలో నిర్వాహక సోదరులు కొందరు తమ తమ పీర్లను పలు వాడల్లో ఊరేగింపు నిర్వహిస్తామంటున్నారు. ఆనవాయితీగా దశాబ్ద కాలంగా పీర్లను స్థానికంగా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కొలువుతీరుతాయంటున్నారు. ఈ విధంగా ఖైరతాబాద్, చింతలబస్తీ, తుమ్మల బస్తీ, వీర్‌నగర్, రాజ్‌నగర్, మక్త, ఇందినగర్, ఓల్డ్ సిఐబి క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో ఆలంలు అనగా పీర్లు వాటంతటిని మొహర్రం అంటారని ఆయా ప్రాంతాల నిర్వాహకులు కొందరు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, స్థానికంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగర పోలీసు కమీషనర్ ఆదేశానుసారం సెంట్రల్ జోన్ డిసిపి నేతృత్వంలో, ఎసిపి ఆధ్వర్యంలో పీర్లు ఉన్న ప్రాంతాలలో అదే విధంగా లైబ్రరీ సమీప ప్రాంతంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సైఫాబాద్ ఇన్స్‌పెక్టర్ సత్తయ్య సూచిస్తున్నారు. అందరూ కలిసికట్టుగా ప్రశాంత వాతావరణంలో మొహర్రం జరుపుకోవాలని ఇన్స్‌పెక్టర్ తెలియచేస్తున్నారు. స్థానికంగా ప్రజలతోపాటుగా కొందరు ప్రజాప్రతినిధులలు పీర్లను దర్శించుకున్నట్లు మరికొందరు చెబుతున్నారు. డప్పువాయిద్యాల మధ్య పీర్లు ఎత్తే సమయంలో హడావుడి ఉంటుందంటున్నారు.

## ఆజాదిక అమృత్ మహోత్సవాలను విజయవంతం చేయాలి

**కంటోన్మెంట్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రతి ఇంటిటా జాతీయ పతాకాన్ని ఎగరవేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, సిఈఓ అజిత్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడి, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 75వ భారత వజ్రోత్సవ వేడుకలను బారీ ఎత్తున నిర్వహించేందుకు, కాలనీ ప్రతినిధులు, ప్రభుత్వ,ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రతీ భారతీయుడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఇంజనీర్లు గోపా క్రిష్ణదాస్, బాలక్రిష్ణ, శానిటరీ సూపరిండెంట్ దేవేందర్, ఆకుల మహేందర్, అధికారులు నర్సింగ్ రావ్,సి.హెచ్.ఉమాశంకర్, పరశరామ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న అజిత్‌రెడ్డి, మెంబర్ రామక్రిష్ణ

## నారాయణ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

**అడ్డగుట్ట, ఆగస్టు 8, ప్రభాతవార్త :** దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్టకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ఏ.నారాయణ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలియగానే అడ్డగుట్ట పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సందీప్ రాజు, అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంట రాజు సాగర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వై.కొమురమ్మ, లక్ష్మి యాదవ్, అనంత క్రిష్ణలు ఆయన బౌతికా యం పై పుష్పగుచ్చం అందజేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సందీప్ రాజు మాట్లాడుతూ నారాయణ మృతి చెందడం పట్ల అడ్డగుట్టలో కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు ఏర్పడిందని వ్యక్తం చేశారు.

## ప్రజలు ఎల్లప్పుడు ఆరోగ్యంగా జీవించాలి

**కంటోన్మెంట్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ప్రజలు ఎల్లప్పుడు ఆరోగ్యంగా జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. శ్రావణ మాసం 2వ సోమవారం సందర్భంగా కంటోన్మెంట్ బోయిన్‌పల్లి సీతారామ్‌పురంలోని వీరంజనేయ దేవాలయంలో లక్ష బిల్వార్చణ పూజా అభిషేక కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శంకరయ్య, గోపాల్‌గౌడ్, సాయిబాబా యాదవ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న జంపనప్రతాప్ తదితరులు

## ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ 'ఆజాదీకీ గౌరవ్‌యాత్ర'కు శ్రీకారం - నేడు అడిక్‌మెట్‌నుంచి ప్రారంభం

**చిక్కడపల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త :** కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో కెసిఆర్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించేందుకు 'ఆజాదీకీ గౌరవ్‌యాత్ర' కార్యక్రమం పేరుతో నేటినుంచి ముషీరాబాద్ నియోజకవ ర్గంలో ఇంటింటికి వెళ్లి వివరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం. అనీల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవా రం రామ్‌నగర్‌లో పార్టీ నగర ఉపాధ్యక్షుడు పాశం అనీల్‌యాదవ్, మాజీకార్పొరేటర్ కల్ప నాయదవ్, రుషికేశ్, జిఎన్. కేశవ్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధనాలను, నిత్యావసర వస్తూవులపై జిఎస్టీ విధింపు, పేదలపై పన్నులభారం, రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించబోతున్నట్లు వివరంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు విడి.కృష్ణ, బి బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, రామ్‌నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ జోహెర్ హుస్సేన్, అడిక్‌మెట్ అధ్యక్షుడు నాగేందర్, తిరుమల్, మేడి సురేశ్, గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం అడిక్‌మెట్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుందని వివరించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎం.అనీల్‌కుమార్‌యాదవ్

## ప్రతిభతోనే ప్రగతి సాధ్యం : డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి

### వైభవంగా అమృతలత అపురూప అవార్డుల ప్రదానోత్సవం


అవార్డుగ్రహీతలతో వరప్రసాదరెడ్డి, గౌరీశంకర్, రోజారమణి, డా. అమృతలత

**నాంపల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త :** డా. అమృలతకు సాహిత్యం, సంగీతం, సామాజికసేవ పట్ల మనస్సు లగ్నంచేసి ఆయా విభాగాల్లో నిష్ణాతులను ఎంపికచేసి అవార్డులతో సత్కరించడం అభినందనీయమని, ప్రతిభను గుర్తించాలంటే ముందుగా మనలో ప్రతిభ ఉండాలని, మనలో ఆ ప్రతిభ లేకపోతే మన చేతులమీదుగా ఇచ్చే ఆ అవార్డులు అపహాస్యమైపోతాయని, ప్రతిభతోనే ప్రగతి సాధ్యమని శాంత బయోటెక్నిక్స్ అధినేత పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. ఈ రోజు అమృతలత, అపురూప అవార్డులు పొందిన గ్రహీతలను ఎంతగానో అభినందించారు. గౌరీశంకర్ మాట్లాడుతూ రచయితలు వ్రాసే సాహిత్యం సమాజాన్ని తప్పకుండా ప్రభావితం చేయాలని, నిద్రపోతున్న సమాజాన్ని మేల్కొల్పాలని, 2030 సంవత్సరానికి 54శాతం మంది మహిళలు ఉద్యోగ ఉపాధి కల్పనారంగాల్లోకి వస్తారన్న అంచనా వేసి ముందుగా తెలుపుతున్నారన్నారు. మన మాటలు, రచనలు జీవితానికి దగ్గరగా లేకపోతే మనం వ్రాసిన వాక్యమే తిరస్కారభావంతో ధిక్కారస్వరంతో ప్రశ్నగా పరిగమిస్తాదన్నారు. మహిళారంగా ఈ రంగాల్లో సగభాగం అవకాశం, ప్రోత్సాహమందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తూ ఇందుకు ఇతోధికంగా కృషిచేస్తున్న డా. అమృతలతను ఎంతగానో అభినందించారు. ప్రముఖ రచయిత్రి, విద్యావేత్త డా. అమృతలత స్థాపించిన అమృతలత, అపురూప అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం సాయంత్రం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో వైభవంగా జరిగాయి. సంస్థ కన్వీనర్ డా. నెల్లుట్ల రమాదేవి నిర్వహణలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాంత బయోటెక్నిక్స్ అధినేత పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి, విశిష్ట అతిథులు తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, ప్రముఖ సినీనటి రోజారమణి, నెల్లుట్ల రమాదేవి తదితరులతో కలిసి నవలా రచన విభాగంలో డా. పరిమళా సోమేశ్వర్‌ను, రేడియో/టీవి రంగం విభాగంలో శైలజా సుమన్‌లను ఘనంగా సత్కరించి అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లును తిరిగి నియమించడం హర్షం

**సైఫాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే 7650 ఫీల్డ్ అసిస్టెంట్లల ను ఉద్యోగాలలో పునర్ నియామకం చేయాలని నేటి నుంచి విధుల్లోకి చేర్చుకోవాలని సిఎం కెసిఆర్ ఆదేశాలు జారీ చేయడం పట్ల రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం 7650 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు తక్షణమే విధుల్లోకి చేరారని, ఈ అసిస్టెంట్లు ఉద్యోగులందరూ డిగ్రీ లు, పిజీలు, ఇంజనీరింగ్ చదివిన ఉన్నత విద్యావంతులేనని చెప్పారు. వీరిని ఏతప్పు చేయకుండానే అన్యాయంగా విధుల్లోంచి తొలగించారని ఈ విషయాన్ని సిఎం దృష్టికి పలు మార్లు తమ సంఘం తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లను రాజ్యాంగ బద్ధమైన పద్దతిలో ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేష న్లను అమలు చేస్తూ రిక్రూట్‌మెంట్ చేయడం జరిగిందన్నారు. ఈ ఫీల్డ్ అసిస్టెంట్లు గత 15 సంవత్సరాలుగా ఇదే ఉద్యోగం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని వీరిని తీసివేస్తే నిరుద్యోగ సమస్య పెరిగిపోతు ందని, కులుంబాలను ఏలా పోషించుకోగలుగుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సిఎం కెసిఆర్ మానవత్వంతో ఆలోచించి వారిని తిరిగి ఉద్యోగాల్లో తీసుకోవడం జరిగిందని సోమవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టం

**సైఫాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టమని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తమరెడ్డి చెప్పారు. క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం ట్యాంక్‌బండ్ వద్దగల డైరెక్టర్ ఆఫ్ యూత్ సర్వీసెస్ యూత్ హాస్టల్‌లో సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. స్వతంత్ర సాధనలో క్విట్ ఇండియా ఉద్యమానిది ప్రధాన భూమిక అని సమర యోధుల త్యాగాలను గుర్తు చేసుకుని దేశ ప్రజలు సమైక్యంగా ఉండి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైస్ మెన్ ఇంటర్‌నేషనల్ రిజినల్ సెక్రటరీ డా.సి. ఇస్తార్‌రాణి, కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్, గాంధీ గ్లోబెల్ ఫ్యామిలీ డా.గున్నా రాజేందర్‌రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ ఛైర్మన్ మామిడి బీమ్‌రెడ్డి, డాక్టర్ సాజితాఖాన్ తదితరులు పాల్గొన్నారు. క్విట్ ఇండియాను పురస్కరించుకుని పలువురు ప్రముఖులను రాజ్‌నారాయణముదిరాజ్ ఘనంగా సత్కరించి అవార్డులను ప్రదానం చేశారు.



క్విట్ ఇండియా దినోత్సవ వేడుకల్లో ర్యాలీ

## 'సంక్షోభంలో తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు' పై సదస్సు

**సైఫాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి (టి-జాక్) ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం ఆధ్వర్యంలో ఈ నెల 18న 'సంక్షోభంలో తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు ఓయూలో నిర్వహిస్తున్నామని కమిటి తెలిపింది. ఈ సదస్సులో వక్తలుగా ప్రొఫెసర్ జి.హారగోపాల్, ప్రొఫెసర్ టి.తిరుపతిరావు, ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ప్రొఫెసర్ కాశీం తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించడం జరుగుతుందని పురుషోత్తం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సులో జాక్ కో-ఆర్డినేటర్ ఎం.వేణు స్వాగతోపన్యాసం చేస్తారని తెలిపారు.

## వర్గీకరణ జోలికి వస్తే సహించేది లేదు

### ఎస్సీ వర్గీకరణ వ్యతిరక పోరాట సమితి ఛైర్మన్ జి.చెన్నయ్య

**సైఫాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం న్యూ ఢిల్లీలోని ఎపి భవన్‌లోని డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట అనేక మంది మాలలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన అనేక మంది మాలలు, మాల ఉపకులాల కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ కాలం చెల్లిన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జోలికి కేంద్ర ప్రభుత్వంగాని, రాజకీయ పార్టీలు వస్తే సహించేది లేదని తగిన మూల్యం చెల్లించు కోవల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో మాలల కంటే మాదిగలే ఎక్కువగా అభివృద్ధి చెందారని, ఈ విషయం హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని ఆయన కే ంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ అంశాన్ని రాజకీయ పార్టీలు అడ్డుపెట్టుకుని తమ పబ్బం గడుపుకుం టున్నాయని, గత రెండున్నర దశాబ్దాలుగా మాల, మాదిగల మధ్య చిచ్చుపె ట్టి అభివృద్ధి చెందకుండా చేస్తున్నాయని జి.చెన్నయ్య ధ్వజమెత్తారు. అంతకు ముందు సమితి ప్రతినిధి బృందం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు.


ఎపి భవన్ ఎదుట నిరసన చేస్తున్న మాలలు


అరెస్ట్ అయిన గ్యాంగ్

## ఫారెన్ కరెన్సీ పేరుతో మోసం చేస్తున్న గ్యాంగ్ అరెస్ట్

**ధర్నాచౌక్, ఆగస్ట్ 8, ప్రభాతవార్త :** తమ వద్ద ఫారెన్ కరెన్సీ ధీరమ్స్ ఉన్నాయని, తక్కువ డబ్బులకే ధీరమ్స్ ఇస్తామని చెప్తూ మోసం చేస్తున్న గ్యాంగ్‌ను ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం హబ్సిగూడ లో ఆర్.చంద్ర (47) పాన్ షాపు నడుపుతూ ఉన్నాడు. ఈనెల 1 వ తేదీ గుర్తు తెలియని ఒక వ్యక్తి పాన్ షాపుకు వచ్చి తన వద్ద పదిలక్షల విలువైన ధీరమ్స్ ఉన్నాయని, హైదరాబాద్ నగరంలో ధీరమ్స్ మార్చుకోవటం తమకు రాదంటూ నమ్మబలికాడు. 50 రూపాయల ధీరమ్ ఇండియా కరెన్సీతో 900 రూపాయలతో సమానమని, తనకు డబ్బులు అవసరం ఉంది కాబట్టి తక్కువకే ఇస్తామని నమ్మబలికాడు. అతను చెప్పిన మాటలతో ఆశ పడిన చంద్ర వారి నుండి ధీరమ్స్ తీసుకుని, వారికి డబ్బు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఇరువురూ ఒకరి ఫోన్ నెంబర్ మరొకరు తీసుకున్నారు. రెండవతేదీ చంద్రకు ఫోన్‌చేసి, తాను రాంనగర్ చేపల మార్కెట్ వద్ద ఫ్యామిలీతో ఉంటున్నానని, మూడు లక్షల రూపాయలు డబ్బు తీసుకుని, చేపల మార్కెట్ వద్దకు వస్తే 1000 ధీరమ్స్ ఇస్తానని చెప్పాడు. డబ్బు తీసుకుని చేపలమార్కెట్‌కు వచ్చిన చంద్రకు ధీరమ్స్ అంటూ ఒక మూటను ఇచ్చి, మూట విప్ప వద్దని, రోడ్డుకు అటువైపు తన భార్య ఉందని, తాను ఇప్పుడే వస్తానని, తాను వచ్చాక, మూట విప్పి లెక్కపెడదామని చెప్పి వెళ్లాడు. ఆ వ్యక్తి ఎంతసేపటికీ రాకపోవటంతో అనుమానం వచ్చి, మూట విప్పి చూడగా న్యూస్ పేపర్లు ఒక కర్చీఫ్‌లో చుట్టి కవర్‌లో పెట్టి ఉన్నాయి. మోసపోయినట్లు గ్రహించిన చంద్ర ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మహారాష్ట్ర కు చెందిన షేక్ భాను (40), ఢిల్లీకి చెందిన కల్పన (సదియా) (28), ముంబైకి చెందిన సానా ఆఫిఫ్‌ఖాన్ (26), వెస్ట్ బెంగాల్ కు చెందిన మహ్మద్ అజాద్ (35) లు నగరంలో ఇటువంటి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి, అరెస్ట్ చేశారు. వీరితో పాటు మరో నలుగురు ఉన్నారని, వారు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. అరెస్ట్ చేసిన వారి నుండి లక్షా యాభైవేల రూపాయల నగదు, 11 మొబైల్ ఫోన్‌లు, 50 రూపాయల విలువైన రెండు ధీరమ్స్, స్వాధీనం చేసుకున్నారు. గతంలో వీరిపై సుల్తాన్‌బజార్, నల్లకుంట, సరూర్‌నగర్, బోయినపల్లి, కాచిగూడ, అఫ్జల్‌గంజ్ తదితర పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయని, ఇటువంటి మోసాలు పెరిగిపోయాయని, ధీరమ్స్ పేరుతో మోసం చేస్తున్నారని, ఇలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

## అమ్మవారిని దర్శించుకున్న మన్నె క్రిషాంక్

**కంటోన్మెంట్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** శ్రావణ మాసస బోనాల ఉత్సవాల్లో భాగంగా కంటో న్మెంట్‌లో రెండు రోజుల పాటు జరిగిన బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


పూజలు చేస్తున్న మన్నె క్రిషాంక్ తదితరులు

## కార్వాన్‌లో హర్ ఘర్ తిరంగా వేడుకలు

**మెహిదీపట్నం, ఆగస్టు 8, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య అమృత మహోత్సవాల్లో భాగంగా సోమవా రం బీజేపీ కార్వాన్ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో కార్వాన్‌లో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వాన్, గుడిమల్కాపూర్ డివిజన్‌లలోని ప్రతి ఇంటింటికి తిరుగుతూ జాతీయ జెండాలను అందజేయడంతో పాటు ప్రతి ఒక్కరికి అమృత మహోత్సవాల ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరు దేశభక్తిని కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఠాకూర్ అమర్‌సింగ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల గోవర్ధన్‌రావు, డిజ్వర్‌సింగ్, భిక్షపతి, దొర్శుల శ్రీనివాస్, వై. అనీల్‌చారి, సునీల్ యాదవ్, కరణ్‌కుమార్, కరుణకుమారి పాల్గొన్నారు.


జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న ఠాకూర్ అమర్‌సింగ్

**జాతీయ జెండాలతో భారీ ర్యాలీ :** అమృత మహోత్సవాలను పురస్కరించుకొని గుడిమల్కాపూర్ డివిజన్‌లో బీజేపీ స్థానిక డివిజన్ అధ్యక్షులు సునీల్ యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్‌సింగ్ పాల్గొని విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపారు. చిన్నతనం నుంచే దేశభక్తి కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ చారి, వెంకటేష్ జోషి, పి. శ్రీనివాస్, యాదగిరి, శ్రవణ్, సచిన్, రామకృష్ణ సాగర్, రాజేందర్, మల్లేష్ యాదవ్, మనోజ్, వినయ్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యుత్ సవరణ బిల్లుతో ప్రమాదమే

### చట్టం అమలైతే రైతులకు 24గంటల విద్యుత్ కష్టమే .. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

### టిఆర్ఎస్ ఉన్నంత వరకు మోటార్లకు మీటర్లు పెట్టనివ్వం : ఎమ్మెల్సీ పల్లా రాజశేఖర్వరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కోదండరెడ్డి, కన్వీనర్ శివాజీ

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** విద్యుత్ సవరణ బిల్లుతో ఎప్పటికైనా ప్రమాదం పొంచిఉందని, విద్యుత్ వ్యవస్థల్లో ప్రైవేట్ సంస్థలు అడుగు పెడితే రైతులు 24గంటల కరెంట్ అందని పరిస్థితులు తలెత్తే ప్రమాదముందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సరవణబిల్లు 2022కు వ్యతిరేకంగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు పి.ప్రకాష్, కన్వీనర్ ఎన్.శివాజీల ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్‌సమావేశం నిర్వహించారు. దీనికి రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ,కిసాన్ సెల్ అధ్యక్షులు కోదండరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లురవి తోపాటు వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొన్నారు. ఈసందర్భం గా పల్లారాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం దొంగచాటున ప్రవేశపెడుతున్నబిల్లుకు వ్యతిరేకంగా పోరాటం నడుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంతవరకు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టన్విబోమన్నారు. రాష్ట్రంలో 30లక్షల మోటార్లు నడిపిస్తూ, రైతులు పం టలు పండించుకుంటున్నారని, విద్యుత్ చట్టాలతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. 2014 నుంచి 2022 వరకు రూ.18వేల కోట్లను ట్రాన్స్‌కోకు, మరో 18వేల కోట్లను డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అదాని లాంటి కొంతమంది కోసం విద్యుత్ చట్టాలను తెస్తూ ప్రజలకు కరెంట్ భారం చేయాలిన కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. గతంలో బిఎస్ఎన్ఎల్ బాగా పనిచేసిందని అంబానీ వచ్చాక అది పోయిందన్నారు. విద్యుత్ చట్టాలు అమలయితే బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల తరహాలో విద్యుత్ ఉద్యోగులకు కష్టాలు తప్పవన్నారు. గుజరాత్ రాష్ట్రంలో 6గంటలు కూడా విద్యుత్ ఇవ్వలేక పోతుందన్నారు. రూ. 3వేలకు వచ్చే బొగ్గును కాదని రూ.30వేలకు వచ్చే బొగ్గును కొనమంటున్నారని ఇదెక్కడి న్యాయమన్నారు. విద్యుత్ బిల్లులను టిఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని, విద్యుత్ జేఏసీకి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణ ప్రదేశ్ కమిటీ ఉపాధ్యక్షులు మల్లు రవి మాట్లాడుతూ విద్యుత్ ఉదన్యగులు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్రాల అనుమతులు లేకుండా చట్టాలు తీసుకు వస్తుందని వాటిని ప్రజలమద్దతుతో అడ్డుకుంటామన్నారు. కిసాన్‌సెల్ అధ్యక్షులు కోదండరెడ్డి మాట్లాడుతూ గతంతో విద్యుత్ బోర్డు ఉండేదని, కార్మికులు వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని 2003లో మార్పులకు కార్మిక సంఘాల అంగీకరించారన్నారు. ఇది కేవలం ఉద్యోగుల సమస్య మాత్రమే కాదని, రాష్ట్ర ప్రజల సమస్య అన్నారు. జాక్ కన్వీనర్ శివాజీ మాట్లాడు తూ ఉద్యోగుల హక్కులు హరించే విధంగా కేంద్రం విధానలు ఉన్నాయన్నా రు. నల్లచట్టాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరముందన్నారు. వ్యాపారవేత్తలకు రూ.10లలక్షల కోట్లు మాఫీచేసిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు తక్కువ ఛార్జీలతో విద్యుత్ అందిస్తున్న డిస్కం నష్టాలను ఎందుక భర్తీ చేయదం లేదని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు పశ్యపద్మ, జె.వి.చలపతిరావు, డిజి నర్సింహులు, జేఏసీ నాయకులు జాన్సన్, రామశ్వరయ్య, తుల్జారాంసింగ్, విజయేందర్‌రెడ్డి, బందెల రవి పాల్గొన్నారు.

## బీజేపిరాష్ట్ర నేత జ్ఞానేంద్ర ప్రసాద్ ఆత్మహత్య

### - బీజేపీలో పెనువిషాదం - పలువురి నేతల ఘననివాళి

**శేరిలింగంపల్లి, అగస్టు 8, ప్రభాతవార్త :** శేరిలింగంపల్లి నియోజక వర్గ కీలకనేత, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యం. జ్ఞానేంద్రప్రసాద్ ఆత్మహత్యచేసు కున్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో బీజేపి పార్టీలో క్రియాశీలకం గా పనిచేస్తూ ఇటీవలే ఓ రోడ్డు ప్రమాదంలో కాలువిరిగి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆకస్మా త్తుగా ఆయన రూంగదికి ఘడియపెట్టి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో బిజెపి నేతలు, కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. మియాపూర్‌లోని ఆల్విన్‌కాలనీ లో నివాసముంటున్న జ్ఞానేంద్ర ప్రసాద్‌కు మూడునెలల క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అతని కాలు విరిగి శస్త్ర చికిత్స కూడా జరిగింది. అనంతరం అతనికి ఫిజియోథెరఫీ ద్వారా ఇంట్లోనే చికిత్సపొందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9గంటల సమమంలో పెంట్‌హౌస్‌లోని అతని గదిలోకి వెళ్లిన జ్ఞానేంద్ర ప్రసాద్ తాను కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటానని పీఏకు చెప్పి వెళ్లిన ఆయన తన గదిలోపల ఘడియ పెట్టి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నారు. కాగా టిఫెన్ ఇచ్చేందుకు పీఏ సురేశ్ తలుపుతట్టడంతో ఎంతకూ తలుపు తీయకపోవ డంతో కిటికీలోంచి చూడగా అప్పటికే జ్ఞానేంద్ర ప్రసాద్ ఉరివేసుకుని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. దీంతో స్థానికుల సహకా రంతో గదితలుపులు బద్దలు గొట్టి హుటాహుటిన అతన్ని స్థానికంగా ఉన్న శ్రీకర ఆసుపత్రికి తరలిం చారు. కాగా అప్పటికే ఆయన మృతిచెందారని వైద్యులు దృవీకరించారు. మృతుడు జ్ఞానేంద్ర ప్రసాద్ భార్య సౌమ్యశ్రీ పిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గత కొనేళ్లుగా బిజెపీలో కీలకంగా పని చేస్తు శేరిలింగంపల్లి నియో జకవర్గంలో బీజేపీ పార్టీకి ఎంతో గుర్తింపు తెచ్చిన జ్ఞానేంద్ర ప్రసాద్ హఠాత్తుగా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని తనువు చాలిం చటంతో బిజెపి పార్టీతో పాటు శేరిలింగంపల్లి, ఆ ల్విన్‌కాలనీలో విషాదచాయలు అలుముకు న్నాయి.


మృతుడు జ్ఞానేంద్రప్రసాద్ (ఫైల్)

**కుటుంబనేపధ్యం :** ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కాణిపాకం మండలం ఐవారు గ్రామంలో వరదరాజులు నాయుడు,సులోచన దంపతులకు జన్మించిన జ్ఞానేంద్ర ప్రసాద్‌కు చిన్ననాటి నుంచి హిందుత్వ బావజాలం ఉండేది. సుమారు 25 ఏండ్ల క్రితం హైదరాబాద్ నగరానికి కుటుం బసభ్యులతో వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. మియాపూర్‌లోని ఆల్విన్ కాలనీలోనివాసుంటూ ఒక వైపు ఫైనాన్స్ వ్యాపారం చేస్తునే మరోవైపు రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకున్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చే ఎందరికో ఆయన ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు చిరువ్యా పారులకు అప్పులిస్తూ వారిని ఆర్థికంగా ఎదిగేందు కు దోహదపడేవారు. ఈ నేపధ్యంలోనే 2019వ సంవత్సరంలో కరోనా అనంతరం ఆయన వ్యాపారంలో ఇబ్బందులు ఎదుర్కొవడంతో పాటు మూడు నెలల క్రితం ప్రమాదానికి గురై కాలు విరిగి ఇంట్లోనే చికిత్సపొందుతున్నారు.

**శేరిలింగంపల్లి బిజెపి కీలకనేతగా జ్ఞానేంద్ర ప్రసాద్ :** ఆర్ఎస్ఎస్ భావజాలంతో గొప్ప హిందుత్వవాదిగా పేరు తెచ్చుకున్న యం.జ్ఞానేంద్ర ప్రసాద్ బీజేవైఎం అనుభంధ సంస్థలలో పనిచేసి శేరిలింగంపల్లి నియోజక వర్గంలో కీలకమైన బిజెపి నేతగా ఎదిగారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులుగా పనిచేస్తున్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో బిజెపి పార్టీకి ఏలాంటి క్యాడర్ లేని సమయంలో కూడా కీలకంగా పనిచేసి పార్టీని బలోపేతం చేసేందుకు ఆయన కృషిచేశారు. నియోజక వర్గంలో బిజెపి ఎంతో పటిష్టంగా ఉండటానికి కీలకంగా పనిచేసిన వారిలో జ్ఞానేంద్ర ప్రసాద్ కూడా ఒకరు. పార్టీ కార్యకలపాలలో చురుకుగా పాల్గొవడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో నిరంతరం తన సొంత నిధులతో వితరణ చేయటం ఆయనకు మంచిపేరును సంపాదించిపెట్టింది.

**జ్ఞానేంద్ర ప్రసాద్‌కు నివాళి :** శేరిలింగంపల్లి నియోజక వర్గ బీజేపీ కీలక నేత మృదుస్వభావి, నిరంతర నిస్వార్థ సేవాగుణశీలి ప్రజాసేవకుడు జ్ఞానేంద్ర ప్రసాద్ అకస్మిక మృతికి శేరిలింగంపల్లి నియోజక వర్గ బీజేపీ రాష్ట్ర నాయకులు, ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు ఆయన అభిమానులు, నివాళులు అర్పించారు. అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం, ఏఈసీటీయు నాయకులు యం సీపీఐ, శ్రీకర ఆసుపత్రిలో ఉన్న జ్ఞానేంద్ర ప్రసాద్ బౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## ఉత్సాహంగా సాగిన హైదరాబాద్ మారథాన్" డ్రైరన్"



డ్రైరన్‌లో పాల్గొన్న రన్నర్లు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** హైదరాబాద్ రన్నర్ సొసైటీ ఎన్ఎండిసి నిర్వహిస్తున్న హైదరాబాద్ మారథాన్ 2022 కోసం సోమవారం 21.195కిమీ, 10కిమీ శిక్షణా పరుగును నిర్వహించారు. నెక్లెస్‌రోడ్ ఎంఎంటిఎస్ స్టేషన్ నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు ఉదయం 5.30గంటలకు ప్రారంభమైన రన్ రాజ్‌భవన్‌రోడ్, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, రోడ్ మీదుగా సాగింది. ఆగస్టు 28న జరగనున్న మారథాన్ కోర్సులో భాగమైన హైదరాబాద్‌లోని ఎత్తు పల్లాలు, వంతెనలు అదిగమించేందుకు రన్నర్‌లకు శారీరకంగా, మానసికంగా శిక్షణ ఇవ్వడానికి ఈపరుగు నిర్వహించబడింది. ఈసన్నాహక శిక్షణాలో 300లకు పైగా రన్నర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

**కంటోన్మెంట్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** కంటోన్మెంట్ అన్నా నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ పోచమ్మ దేవా లయంలో జరిగిన బోనాలు, పలహార బండి ఊ రేగింపు, రంగం (భవిష్యవాని) అంగరంగ వైభ వంగా జరిగాయి. పలహార బండి ఊగరే గింపులో నిర్వహించిన వేడుకలకు బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, టిఆర్ ఎస్ నాయకులు దేవులపల్లి శ్రీను, సంతోష్, కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హోం సర్వీస్ సేవలు ప్రారంభం

నిజాంపేట్, ఆగష్టు 8 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి లో ఎస్ఎల్‌జీ మల్టీస్పెషాలిటీ ఆధ్వర్యంలో హోం సర్వీసులను సోమవారం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వారు ఎమ్మెల్సీ, కుటుంబ సభ్యులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు మాట్లాడుతూ రోగులు రోగ నిర్ధారణ పరీక్ష కోసం గంటల సేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే మా సిబ్బంది వచ్చి రక్త నమూనా పరీక్షలు, ఇతర పరీ క్షలు నిర్వహిస్తారు. అంతేకాకుండా శాంపిల్స్ కలెక్ట్ చేసుకునే వ్యక్తి, నర్సింగ్ విజిట్, ఫిజియో థెరపిస్ట్ రోగికి అవసరమైన సమయంలో షెడ్యూల్ చేసుకోవచ్చు. ఆసుపత్రికి 10 కిలో మీటర్ల పరిధిలో ఉన్న రోగులకు ఎస్ఎల్‌జి హోం సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌జీ ఆసుపత్రి సిబ్బంది గౌరవ్‌ఖురానా, వైద్యులు, నర్సింగ్, ఫిజియోథెరపి సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే వైద్య పరీక్షలు

దుండిగల్, ఆగష్టు 8 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో శంభీపూర్ గ్రామంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్ఎల్‌జీ ఆసుపత్రి హోం సర్వీసెస్ సేవలను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రారంభించారు. ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోమరాజు, డైరెక్టర్ యశ్వంత్, సీఈఓ గౌరవ్, మెడికల్ అడ్మిన్ సురేందర్, మార్కెటింగ్ మేనేజర్ విక్రమ్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

### కట్టమైసమ్మ బస్తీలో ముస్లిం సోదరుల ప్రార్థనలు



జీడిమెట్ల, ఆగష్టు 8 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి కట్టమైసమ్మ బస్తీలోని పీర్ల మజీద్ వద్ద సోమవారం ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలో కుత్బుల్లాపూర్ టీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ఎస్.కే అబిద్, మురళి, ఇస్మాయిల్, అహ్మద్‌బాషా, అశోక్, రాజు, ఖాజా తదితరులు ఉన్నారు.

### పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

బేగంపేట ఆగష్టు 8,ప్రభాతవార్త : దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ జన్మ దినోత్సవం సందర్భంగా పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ చేసారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పిడి నవీన్‌కుమార్ బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ముప్పిడి శాంతాబాయ్, గోపాల్ దీవెనలతో బడుగు,బలహీన వర్గాల చిన్నారులకు తనకు తోచిన విధంగా అండగా ఉంటున్నాని అన్నారు. దళితులకు రాజ్యాధికారం రావాలంటే దళితులంతా కల్సి ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాదిగ, రమేష్‌మాదిగ, ఆనంద్, పవన్‌కుమార్,రాజు తదితరులు నవీన్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రజలు ఎల్లప్పుడు సుభిక్షంగా జీవించాలి

ఎమ్మెల్యే మైనంపల్లి



అన్నా నగర్ పోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్, మార్కెట్ మాజీ చైర్మన్ ముప్పిడిగోపాల్

కంటోన్మెంట్, ఆగష్టు 8 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు సుభిక్షంగా, ఆరోగ్యంగా జీవించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్ తెలిపారు. ఎసోమవారం కంటోన్మెంట్ 3వ వార్డు అన్నా నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాలు, పలహార బండి ఊరేగింపు, రంగం ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్ మైనంపల్లికి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా బాలంరాయి దండు మారెమ్మ దేవాలయంలో జరిగిన పూజల్లో కూడా మైనంపల్లి పాల్గొన్నారు.

## బీసీలకు సముచిత న్యాయం కేవలం జాజులతోనే సాధ్యం

చిక్కడపల్లి, ఆగష్టు 8 ప్రభాతవార్త: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను సంఘం మహిళా విభాగం కార్యనిర్వాహక అధ్యక్షురాలు మని మంజరి ఘనంగా సత్కరిచారు. ఆ కార్యక్రమంలో మహిళా నాయకులు స్వర్ణ, సుజాత, శ్యామల, సమత, గౌతమి, జ్యోతి, ఝాన్సీ, కవిత, సావిత్రి, సత్తెమ్మ, వాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంతో కృషి చేసిన జాజుల శ్రీనివాస్‌గౌడ్ జాతీయ అధ్యక్షుడిగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బీసీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఆయన పాత్ర ఎంతో ఉందని అన్నారు.

## దివ్యాంగులతో 'తిరంగా యాత్ర'

హైదరాబాద్, ఆగష్టు 8 ప్రభాతవార్త: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్‌మహోత్సవ్ సందర్భంగా దివ్యాంగులతో 'తిరంగా యాత్ర' నిర్వహించాలని నిర్ణయించినట్లు బిజెపి సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు వివరించారు. సోమవారం తిరంగాయాత్రకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 12న ఈ యాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. ఈ సందర్భంగా జరిగిన సన్నాహక కార్యక్రమంలో బిజెపి నేతలు శ్రీధర్ చిట్టి, వికలాంగుల సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కొమాండూరి శేషాద్రికి చౌటి భాస్కర్ పురస్కారం

చిక్కడపల్లి, ఆగష్టు 8 ప్రభాతవార్త: కిన్నెర ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసులు, గానగంధర్వ స్వర్గీయ చౌటి భాస్కర్ 83వ జయంతి సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు కొమాండూరి శేషాద్రికి చౌటి భాస్కర్ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గనసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీత విద్వాంసులు, అవధూత నామధేయులు, కళారత్న డాక్టర్ ఎం.చిత్తరంజన్ హాజరై ఈ పురస్కారాన్ని కొమాండూరి శేషాద్రికి అందించి గౌరవించారు.



హైటెక్ సిటీలో జరిగిన స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, దుండిగల్ మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణవేణి తదితరులు

## ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్దే ధ్యేయం

**కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్**



డ్రైనేజ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

వివేకానందనగర్‌కాలనీ, ఆగస్టు 8, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ అబివృద్ధే ధ్యేంగా పనిచేస్తానని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2లో నూత నంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైనేజి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఊపాధ్యక్షులు రాజేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలు లెక్కిస్తున్న భక్తులు

సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త : బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం లోని హుండీలను ఏసి ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్ నికింద్రాబాద్ సమక్షంలో ఏసి, ఈఓఎస్ అన్నపూర్ణ, చైర్మన్ సాయిబాబా గౌడ్, పి.శ్రీదేవి ఇన్స్‌పెక్టర్ ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్ సికింద్రాబాద్, బ్యాంక్ ఆఫ్‌బరోడా ఎస్సార్‌నగర్ శాఖ అధికారులు లెక్కింపు చేశారు. జూన్ నెల 27వ తేదీ నుండి సోమవారం వరకు వచ్చిన సాధారణ హుండీల ఆదాయం 57,83,775, నాణెలు 2,04,425, అన్నదాన హుండీ 57, 240 మొత్తం హుండీల ఆదాయం 60,45,440 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగ విదేశీ కరెన్సీ యుఎస్ డాలర్లు 184 సింగపూర్ డాలర్లు 2, సౌదీ రియాల్స్ 2, కెనడా డాలర్లు 10యుకె పౌండ్లు 5యుఏఈ దిర్హామ్‌లు 10క్వాటర్ రియాల్స్ 11 ఆదాయంలో వచ్చినట్లు తెలిపారు.

### ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి వ్యాయామమే రక్షణ కవచం

వివేకానందనగర్‌కాలనీ, ఆగస్టు 8, ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి అని కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం కెపిహెచ్ డివిజన్‌లోని ఎన్ఆర్ఎస్ కాలనీలో షటిల్‌కోర్ట్, డైమెంట్ స్టేట్‌లోని ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన అగ్రగామి నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లోని పార్కులు, ఇండోర్ స్టేడియంలు, షటిల్‌కోర్టు ఓపెన్‌జిమ్‌లతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. పార్కుల్లో అత్యాధునిక సదుపాయాలతో ఓపెన్ జిమ్‌లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా నివాళులు

నేరేడ్‌మెట్, ఆగష్టు 8 ప్రభాతవార్త: వాజ్‌పేయ్‌నగర్‌కు చెందిన భవాని, అర్జున్ యాదవ్‌ల కుమార్తె సుమన్ ఇటీవల హైఫివర్‌తో అకస్మాత్తుగా మరణించింది. మల్కాజిగిరి డాక్యుమెంట్ రైటర్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి చేకొండ నరేష్ బాబు ఏర్పాటు చేసిన సంతాప సభకు పలువురు ప్రముఖులు హాజరై ఆమె చిత్రపటానికి కొవ్వోత్తులతో ఘనంగా నివాళులర్పించారు. కార్పొరేటర్లు క్యానం రాజలక్ష్మి, వి. శ్రావణ్‌కుమార్‌తో పాటు మల్కాజిగిరి సబ్ రిజిస్టర్ పలని కుమారి తధితరులు హాజరై చిన్నారి చిత్రపటానికి పూల మాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. బేబీ సుమన్ హఠాన్మరణం జీర్ణించుకోలేకపోతున్నామని ఆమె ఆత్మకు శాంతి కలుగాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓంప్రకాష్, సాయి, కృష్ణప్రసాద్, కిరణ్, లక్ష్మణ్, నజీర్, ఉడత నవీన్, మురళీ, సుధీర్ యాదవ్, సంతోష్ యాదవ్, హరీష్, ప్రణయ్, కుమారి, మనోహర్, జనార్థన్, పి. కృష్ణ, యూసుఫ్, జ్యోతి, రూప తధితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లో పనిచేసే వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన గంగాధర్ (ఫైల్ ఫొటో)

కంటోన్మెంట్, ఆగష్టు 8 ప్రభాతవార్త: ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి సింగరాయపల్లికి గంగాధర్ (33) పొట్టకూటి కోసం నగరానికి వలస వచ్చి తాడ్‌బంద్ సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన డ్యూటీకి వెళ్లిన గంగాధర్ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తన భార్య తులసి బంక్ యజమానికి కలిసింది. అక్కడ కూడా కనిపించకపోవడంతో సోమవారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజు దర్యాప్తు చేస్తున్నారు.

### ఘనంగా శ్రావణమాస బోనాల ఉత్సవాలు



అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మేయర్ బండకార్తికరెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్

తార్నాక, ఆగస్టు 8 ప్రభాతవార్త: తార్నాక వైట్ హౌజ్ ప్రాంతంలో ఉన్న ఉప్పలమ్మ రేణుక ఎల్లమ్మ శ్రావణ మాస బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బోనాలను సమర్పించేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. దీంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. బిజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న ఆద్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మాజీ మేయర్ బండ కార్తికచంద్రారెడ్డి, బిజేపీ జిల్లా అధ్యక్షులు శ్యామ్‌సుందర్ గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, కృష్ణమూర్తి, ప్రభు గుప్త, కనకట్ల హరి, శారద మల్లేష్, కన్నాభిరాం, రాముపర్మ, సుక్కగణేష్ ముదిరాజ్, బండ శివారెడ్డి, ప్రకాష్‌గౌడ్, కొన్నె సంపత్, కృష్ణగౌడ్, దేవుడు కుమార్, మణి, టెంపుల్ సాయి, రేణుక, దేవేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే మాధవరం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

వివేకానందనగర్ కాలనీ, ఆగస్టు 8, ప్రభాతవార్త : అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా టిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం మూసాపేట డివిజన్‌లోని వడ్డేరబస్తీలో 70లక్షల రూపాయలతో సీసీరోడ్డు, పిఆర్‌నగర్‌లో 17లక్షల రూపాయలతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికై భవిష్యత్ అవసరాలను సైతం దృష్టిలో పెట్టుకుని ప్రణాళికయుతమైన విధానంతో ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లోని పార్కులు, ఇండోర్ స్టేడియంలు, షటిల్ కోర్ట్, ఓపెన్ జిమ్‌లు ప్రజలకు మైలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అభివృద్ధిలో ఎక్కడ కూడా రాజీ పడకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రజలు కూడా ప్రతినిత్యం వ్యయామానికి ఒక గంట సమయం కేటాయించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## అవదాన అగ్రేసరుడు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి: ఎమ్మెల్సీ మధుసూధనాచారి



ప్రముఖ సాహితీవేత్త చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి, ఆగష్టు 8 ప్రభాతవార్త: తిరుపతి వేంకట కవులుగా ప్రసిద్ది పొందిన జంట సాహితీ స్రష్టలలో బహుముఖ ప్రజ్ఞావంతుడు, కవి, పండితులు, అవధాన అగ్రేసరులు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి అని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. చెళ్ళపిళ్ళ అవధాన(ఆశు) కవిత్వం ధార, ధోరణితో తెలుగు సాహితీలోకంలో పెద్ద అలజడిని సృష్టించారన్నారు. ప్రముఖ సాహితీవేత్త చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి జయంతి సభ సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ఎందరో మహానుభావులు మధురస్మృతులలో భాగంగా గానసభలో జరిగింది. గానసభ అధ్యక్షులు కళావిఎస్. జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మధుసూదనాచారి మాట్లాడారు. ప్రముఖ సినీగేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ వ్యవహారిక భాషలో ఉన్న అనేక పదాలను పద్యాలలో ప్రయోగించి, అన్ని మాండలికాలకు గౌరవం ఆపాదించి పెట్టారని అన్నారు. ఆయన సాహిత్యంలో ఎంతటి పండితులనైనా, కవులైనా ధీ కొట్టారని, చర్చలకు ఏనాడూ వెనుకంజ వేయలేరన్నారు. శతావధానంలో అద్భుతమైన ప్రతిభను కనబర్చి, నాటి రాజ్య సంస్థానాలలోను, నేటి సమాజంలోనూ అపారమైన గౌరవం,కీర్తిని పొందారన్నారు. ఏనుగులపై ఊరేగింపులు వంటి అరుదైన సత్కారం పొందిన ఆధునిక కవులలో ప్రముఖుడుగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డుగ్రహీత డాక్టర్ ఎస్పీ.భారతి, జీవిఆర్ ఆరాధన ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయ నిధి వరంగా మారింది : ప్రకాశ్‌గౌడ్



కోకాపేట్ గ్రామానికి చెందిన కుమార్‌కి రూ.60.వేల సిఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, ఆగస్టు 8 ప్రభాతవార్త : నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరంగా మారిందని రాజేంద్రనగర్ శాసన సభ్యులు టీ.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేట్ గ్రామానికి చెందిన కుమార్‌కు రూ.60.వేల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం సహాయ నిధిని సీఎం కేసీఆర్ రెట్టింపు చేశారని, అందుకే దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఈ చెక్కులు అందుతున్నాయన్నారు. సమైక్య రాష్ట్రంలో ఏడాదికి పది మందికి మాత్రమే ఈ సహాయం అందేదని, ఇప్పుడు అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇచ్చి ఆదుకుంటున్నామన్నారు. ఈ చెక్కులతో నిరుపేదలు ధైర్యంగా పెద్ద ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు నిత్యం అందుబాటులో ఉంటున్నారన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వారికి తెలుపాలని, వీలైనంత త్వరగా ఆ సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. ప్రతీ మూడు నెలలకో మారు రూ.కోట్లను వెచ్చించి నార్సింగి మున్సిపాలిటీలో మౌళిక వసతులైన తాగునీరు, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజి, రోడ్ల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులంతా కలిసి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, సీనియర్ నాయకులు హరిశంకర్, మల్లేష్ యాదవ్, గణేష్, మహిపాల్, తులసిరామ్, మధు, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణభాషకు పట్టంకట్టిన విదుషీమణి డా. యశోదారెడ్డి : ఆచార్య ఎల్లూరి శివారెడ్డి



వెంకటేశ్వరరెడ్డికి యశోదారెడ్డి సాహిత్య పురస్కారం అందిస్తున్న శివారెడ్డి, చెన్నయ్య తదితర అతిథులు

నాంపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త : కొన్ని దశాబ్దాల క్రితమే తెలంగాణ భాషకు గౌరవం తీసుకొచ్చి పట్టంకట్టిన విదుషీమణి డా. పాకాల యశోదారెడ్డి అని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సోమవారం డా. పి.యశోదారెడ్డి 93వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన డా. యశోదారెడ్డి సాహిత్య పురస్కార ప్రదానోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో శివారెడ్డి డా. యశోదారెడ్డి కుమార్తె, ప్రముఖ చిత్రకారిణి డా. బి.లక్ష్మీరెడ్డి పురస్కారం ఏర్పాటుకు అందజేసిన నిధి నుండి ప్రముఖ కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డికి డా. యశోదారెడ్డి సాహిత్య పురస్కారం, 10వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించి ప్రదానంచేసి ప్రసంగిస్తూ ఆమె తెలుగులో హరివంశాల పైన అసాధారణమైనరీతిలో చేసిన పరిశోధన అందరి మెప్పు పొందిందని గుర్తుచేశారు. నిజాం కళాశాలలో యశోదారెడ్డితో కలిసి పనిచేసే అవకాశం కలిగిందని ఆమెతో గల అనుబంధాన్ని పంచుకున్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య స్వాగతోపన్యాసంలో ప్రాచీన సాహిత్య పరిశోధన, బోధనచేసి పండితులను మెప్పించిన యశోదారెడ్డి తెలంగాణ ప్రజల భాషలో కథా రచన, ప్రసంగాలు చేయడం ఆమె ప్రజ్ఞకు నిదర్శనమని కొనియాడారు. నేటి పురస్కార స్వీకర్త కోట్ల వెంకటేశ్వరరెడ్డి ఇప్పటివరకు 13 కవితా సంపుటాలు, వనపర్తి జిల్లా సాహిత్య చరిత్ర వెలువరించారని, కాళోజీ, డా. సినారె అవార్డులు వంటి గౌరవాలందుకున్నారని వివరించారు. పురస్కార స్వీకర్త కోట్ల వెంకటేశ్వరరెడ్డి యశోదారెడ్డి కథల్లో తెలంగాణ మాండలికానికి అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, ధర్మశాల కథా సంపుటాలను తన ప్రసంగంలో విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో డా. ఎం.సుజాతారెడ్డి, డా. సి.వసుంధర, డా. కృష్ణవర్ధన్, వి.మనోహర్‌రెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## పవిత్రోత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీవారి ఆలయం



చిక్కడపల్లి, ఆగష్టు 8 ప్రభాతవార్త: చిక్కడపల్లిలోని పవిత్రమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు వార్షిక పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబోతుతున్నట్లు ఆలయ వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీయుకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు వివరించారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో ఈ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 9న పవిత్రాహ్వానం, స్వస్తివాచనము, రక్షాబంధనము, రుత్వికరణము, అగ్నిప్రతిష్ఠ, హవనము, వేదప్రబంధ పారాయణాలు, ఆరగింపు మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారంగా జరుగుతాయి. వెంకటేశ్వరస్వామివారికి ప్రతినిత్యం సేవలు, కైంకర్యాలు, ఉత్సవాలు జరుగుతూనే వుంటాయి. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం జాతశౌచం, మృతాశౌచం వంటి సమయాల్లో ఏవైనా తెలిసో.. తెలియకో.. పొరబాట్లు, సిబ్బంది వల్ల తప్పులు దొర్లడం మానవసహజం. ఇలాంటి వాటిని సంపూర్తిగా మన్నించమనీ, ప్రక్షాళనదిశగా, ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు స్వామివారిని వేడుకుంటూ నిర్వహించే కార్యక్రమాన్నే పవిత్రోత్సవాలుగా భావిస్తారు. ఈ ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి చిక్కడపల్లి శ్రీవారి ఆలయం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. ఆగస్టు 10న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు స్వస్తివాచనము, మూర్తి హోమం, నవకలశ స్నపనము, అభిషేకం, వేదప్రబంధ పారాయణము, ఆరగింపు, మంత్రపుష్పం ఉంటుందని వివరించారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ధాన్యాధివాసము, శయ్యాధివాసము, పుష్పాధివాసము, మూర్తి కుంభావాహన, పవిత్రమూర్తి, హోమం, వేదప్రబంధ పారాయణాలు, ఆరగింపు, మంత్రపుష్పం ఉంటాయని పేర్కొన్నారు. 11న పూర్ణాహుతి అనంతరం 41 కలశాలతో అభిషేకం, తిరుమంజన సేవ, మహానైవేద్యము, మంత్రపుష్పం, పవిత్ర ప్రదానం, చందన గోష్ఠి, ఆశీర్వాదము, వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారికి జరిగే పవిత్రోత్సవాల్లో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

నిట్ సం.19/SE/KPZ/GHMC/2022-23 తేది: 05.08.2022

పనుల పేరు: 1) ప్రికాస్ట్ స్లాబ్‌లు, అంచనా మొత్తం: రూ.114.00 లక్షలు ప్రారంభ తేదీ, సమయం: 06.08.2022, మ.02.00 గం. బిడ్స్ స్వీకరణ చివరి తేదీ, సమయం: 10.08.2022 మ.02.00 గం. 2) వరద నీటి కాలువలు, పార్క్ అభివృద్ధి, ఐడిపిఎల్ జంక్షన్ అభివృద్ధి, అంచనా మొత్తం: రూ.980.00 లక్షలు. ప్రారంభ తేదీ, సమయం: 11.08.2022 మ.02.00 గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 18.08.2022 మ.02.00 గం. అధికారి పేరు: చిరునామా: SE/KPZ, GHMC, సెల్ నం.9989930363.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, కూకట్‌పల్లి జోన్, GHMC

DIPR.No.004-06-PP/CL/Advt/1/2022-23, తేది: 06.08.2022

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

ప్రకటన

నిట్ సం.39/EE/C 14/GHMC/KZ/2022-23, తేది: 08.08.2022, "కొటేషన్‌ల కొరకు అభ్యర్థన" ఆహ్వానం "ఉద్యోగులు, భూ పరిహారం కాంట్రాక్టరులు మరియు పారిశుద్ధ్య గ్రూప్‌ల యొక్క 16A మరియు ఫారం 16, ఫారం 24Q మరియు 26Q, 200(3) సెక్షన్ క్రింద TDS రిటర్న్‌ల ఫైలింగ్" టెండర్ ప్రకటన, బిడ్ పిలిచే తేది: 09.08.2022 మ.3.00 గం. బిడ్ దాఖలు గడువు తేదీ, సమయం: 23.08.2022 మ.3.00 గం. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌పై (tender.telangana.gov.in) ప్రి-క్వాలిఫికేషన్ మరియు టెక్నికల్ బిడ్స్ తెరచుట: 23.08.2022 సా.04.00 గం. అందుబాటు అర్హత కలిగిన ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ఏజెన్సీలు వారి కొటేషన్‌లను పై పీరియడ్‌లో ఇన్సూరెన్స్ పీరియడ్‌తో సహా వ్యాలిడిటీ యొక్క వివరాలతో దాఖలు చేయవలెను.

DIPR.No.5471-PP/CL/Advt/1/2022-23, తేది: 08.08.2022 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-14, GHMC

**IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR**
**O.S.No. 461 OF 2022**

Between:
1. **Gantaram Venugopal Rao** S/o Late G.Srisailam, Aged about 65 years, Occ: Private Employee, R/o H.No. 1-75/4/1/16/1, New Sai Maruthi Nagar, Boduppal, Medchal Malkajgiri District.
2. **Gantaram Santhosh Kumar** S/o G.Venugopal Rao, Aged about 36 years, Occ: Pvt.Employee, R/o H.No. 2-2-647/235/A/6/2, Bagh Amberpet, Hyderabad.
3. **Gantaram Dilip Kumar** S/o G.Venugopal Rao, Aged about 34 years, Occ: Pvt.Employee, R/o Flat No.302, Sai Complex, H.No.2-2-1075/20/F, Bagh Amberpet, Hyderabad. ...Plaintiffs

AND

1. The Tahasildar, Abdullapurmet Mandal, Ranga Reddy District.
2. ALL CONCERNED ...Defendants

To
All Concerned
Please take Notice that, the above said Plaintiffs have filed the Suit for Declaration to declare the Plaintiffs are the Legal Heirs of Late Kalyani Gantaram W/o: G.Venugopal Rao in respect of suit schedule property, in which if any person or persons having any claim, interest or objections they may appear before the above said court on 20-08-2022 at 10.30 a.m., as such please make it convenient to attend either in person or through an Advocate, failing which, the matter will be decided Ex-parte.

**SUIT SCHEDULE PROPERTY**

All that the piece and parcel of Plot No.157 (Western Part), admeasuring 200 Sq.yards., or 167.22 S.meters., out of 400 Sq.yards., in Sy.No.922 & 931, situated at Koheda Village, Abdullapurmet Mandal, Ranga Reddy District, Telangana State, and bounded as follows: NORTH: Plot No.158, SOUTH: 33 Feet Wide Road, EAST: Part of Plot No.157 (Eastern Part), WEST: 33' Feet Wide Road.

// BY ORDER OF THE COURT //
**(D. VENKAT REDDY)**
**Advocate.**
H.No.11-8-157/A, Road No.9, Kranthi Nagar, Kothapet, Hyderabad, Cell: **99480 97075.**

**IN THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**IA.NO. 2702 OF 2020**
**IN**
**A.S. (SR) NO. 7535 OF 2020**

**Between :**
Sri. Chanakya Babbar (Baddar)
**...Petitioner/Appellant**
**And**
Smt. Saheen Khan and 6 others
**...Respondents/Respondents**

To,
1. Smt. Saheen Khan W/o. Sri Mohd. Iqbal Ali, D/o. Late Mohd. Habeebuddin Khan, aged about 46 years, Occ: Advocate. R/o D.No. 11-4-614/9, A.C.Guards Road, Hyderabad.
3. Smt. Arjumad Ayesha @ Irfana Asra D/o Late Mohd. Habeebuddin Khan, Aged about 44 years, Occupation: Household, R/o. H.No. 16-9-582, Malakpet, Hyderabad.
4. Sri Syed Yakub Ali S/o Late Sri Syed Mahboob Ali, Aged about 65 years, Occupation: Business, R/o. H.No. 23-1-718/1, Moghalpura, Hyderabad, Presently residing at 1-8-91/18, Om Towers, Flat No.501, PG Road, Secunderabad.
6. Sri. Virat Baddar S/o Late Chandrapgupta Aurora, Aged about 40 years, Occupation: Business, R/o. H.No.4-1-477, Troop Bazar, Hyderabad, Presently residing at 1-8-91/18, Om Towers, Flat No.501, PG Road, Secunderabad.
7. Ms. Ritu Babbar (Baddar) D/o. Late Chandrgupta Aurora, Aged about 38 years, Occ: Business, R/o. H.No.4-1-478 & 479, Troop Bazar, Hyderabad.
...Respondent Nos. 1,3,4,6&7

Take notice that the above named Petitioner has filed the above A.S. (SR) No. 7535/2020, under Order 41 Rule 3(A) of CPC R/w. Sec.5 of Limitation Act, before the Hon'ble Chief Civil Judge, City Civil Court, Hyderabad, against the Respondents. The same is posted for your appearance on 23.08.2022 at 10.30 A.M. If you failed to appear in person or through an Advocate, you will be set ex-parte and the matter will be decided in your absence.

**//BY THE ORDER OF THE COURT//**
**N. Gangadhar**
**R.Prabhulingam**
**Advocates,**
3-4-424, 2nd Floor, Rahul Towers, Adj. Blood Bank, Narayanaguda, Hyderabad 500 029.

## బోనాలు తెలంగాణ సాంప్రదాయానికి అద్దం పడతాయి:మల్‌రెడ్డి రాంరెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** బోనాలు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు అర్థం పడతాయని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. శ్రావణమాసం బోనాల సందర్భంగా కొత్తపేట డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయి రాం ఆధ్వర్యంలో అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించగా మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాంరెడ్డిని శాలువాతో సత్కరించారు. అమ్మవారికి ఆయన ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాల్‌రెడ్డి, నర్సింహయాదవ్, గుర్రం శ్యామ్ చరణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి

**ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ :** అంగరంగ వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ విజయపురికాలనీ పోచమ్మ, యల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల (మూడు గుళ్ళు) దేవాలయం వద్ద నుండి శ్రీ ఖిల్లామైసమ్మ అమ్మవారి దేవాలయం వరకు శ్రీమైసమ్మా అమ్మావారి ఫలహారా బండి ఉరేగింపు ఉత్సవం కమిటి సభ్యులు పున్న గణేష్‌నేత, బండి మధు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ మాజీ కార్పోరేటర్ దేప సురేఖ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, బిసి నాయకుడు గట్ల రవీంద్ర, నల్లెంకీ ధనరాజ్‌గౌడ్, దేప మహిందర్‌రెడ్డి, బోక్క భూపల్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ శివ, పున్న రమేష్, కామినేని శ్రీకాంత్, శ్రీకాంత్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న గణేష్‌నేత

## మీర్‌పేట్ గ్రామదేవత విగ్రహ ప్రతిష్టాపనోత్సవాన్ని విజయవంతం చేయాలి : తీగల

**సరూర్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్ గ్రామంలో పునర్నిర్మాణం జరుగుతు న్న పురాతనమైన పోచమ్మ ఆలయంలో ఈ నెల 11 నుండి 14వ తేదీ వరకు జరిగే అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనోత్స వాలు, బోనాల మహోత్స వాన్ని పురస్కరించుకొని జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం మాజీ ఎమ్మెల్యే, గ్రామ పెద్దలు తీగల కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ కార్యక్రమాలను రాజకీయాల కతీతంగా అందరూ విజయవంతం చేయాలని ఆయన గ్రామ నాయకులకు సూచించారు. అనంతరం తీగల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనోత్స వాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, కార్పోరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, తీగల మాధవి సాయినాథ్‌రెడ్డి, ఉయ్యాల నవీన్‌గౌడ్, కీసర హరినాథ్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, హనుమంతరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తీగల కృష్ణారెడ్డి

## దళితబంధు పథకంతో బియ్యం దుకాణం

**ఉప్పల్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** దళితబంధు పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం హబ్సిగూడ వెంకట్‌రెడ్డినగర్‌లో మహిళా నేత యాదమ్మకు దళితబంధు పథకం ద్వారా మంజూరైన బియ్యం దుకాణాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ప్రతి డివిజన్‌లో పది మందికి మొదటి విడత దళితబంధు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే మరో విడత మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు డా.బి.వి.చారి, కార్యదర్శి సోమిరెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


బియ్యం దుకాణాన్ని ప్రారంభిస్తున్న బేతి సుభాష్‌రెడ్డి

## ప్రజా సమస్యలపై ఎంసిపిఐయు పోరాటం - కామ్రేడ్ పురుషోత్తం

**సరూర్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసే మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వాటి పరిష్కా రానికి నిరంతరం కృషి చేస్తుందని ఎంసిపిఐ యు (మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇం డియా-యునైటెడ్) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం అన్నారు. బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలోనున్న జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు బి. సుజాత అధ్యక్షతన ఎంసిపిఐయు ముఖ్య కార్య కర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భం గా ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తం పార్టీ చేపట్టే కార్యక్రమాలను వివరించి దిశానిర్దేశనం చేశారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలన వల్ల సామాన్యుల బతుకులు భారంగా మారాయనీ అంతే కాకుండా పాఠశాలలు ప్రారంభమైనా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందలేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్, బస్సు ఛార్జీల పెరుగుదలతో ప్రజలు, ఉద్యోగాలు రాక నిరుద్యోగులు, డబుల్ బెడ్ రూం ఇళ్ళు మంజూరు గాక నిరు పేదలు అల్లాడుతున్నారని ఆయన వివరించారు. ఈ సమస్యలపై పార్టీ పోరాటాలు చేస్తుం దని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ రాజు, జగదాంబ, సంధ్యారాణి, రావుల ఝాన్సీ, నాగేంద్రమ్మ, జి.కృష్ణ, జగన్, భాను ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి పురుషోత్తం

## నేటి నుండి మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పాదయాత్రలు

**సరూర్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** దేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఎఐసిసి ఆదేశాల మేరకు తెలంగాణ పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపును పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గంలో 75 కిలోమీటర్ల మేర 75 మందితో కాంగ్రెస్ పాదయాత్రలు నిర్వహిస్తున్నదని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. సోమవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి తదితరులతో పాదయాత్రల విజయవంతం కోసం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9న కందుకూరు మండలంలో, 10న మహేశ్వరం మండలంలో, 11న తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో, 12న బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో, 13న మీర్‌పేట్ కార్పొరేషన్‌లో, 14న సరూర్‌నగర్, ఆర్‌కెపురం డివిజన్లలో జరిగే పాదయాత్రలను కలిసికట్టుగా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నేనావత్ బాలు నాయక్, బండారి మనోహర్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, గట్టు బాలకృష్ణ, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి:ఎమ్మెల్యే

**ఎల్.బి.నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతిఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. హయత్‌నగ ర్, సరూర్‌నగర్ మండలలాకు సంబంధించిన లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, ఎగ్గే మల్లేశంకురుమాలతో కలిసి కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పేద ప్రజలకు ఆర్థికంగా ఆసరా లభిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెండ్లిల భారం తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగరం, హయాత్‌నగర్ తహసిల్దార్‌లు జయశ్రీ, షాంశుద్దిన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న సుదీర్‌రెడ్డి, దయానంద్‌గుప్తా

## అబాకస్ నేర్చుకోవడం వల్ల విద్యార్థుల మేధాశక్తి మెరుగుపడుతుంది

**మలక్ పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త :** అబాకస్ నేర్చుకోవడం వల్ల విద్యార్థుల మేధోశక్తి, ఏకాగ్రత మెరుగుపడు తుందని ఓసియన్ ఏబీఎం స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ మహబూబ్ అలీ అన్నారు. అక్బర్‌బాగ్‌లోని ఆర్యవైశ్య సంఘంహాల్లో మలక్‌పేట బ్రాంచ్ ఎస్ఐపి అబాకస్ 4వ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మహమూద్ మహబూబ్‌అలీ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబాకస్‌ను నేర్చుకోవడం వల్ల ఎంత సంక్లిష్ట గణిత సమస్యలనైన సరళ పద్ధతి లో పరిష్కరించవచ్చన్నారు. పురాతన గణిత మేధోశక్తికి అబాకస్ నిదర్శనం అన్నారు. మలక్‌పేట బ్రాంచ్ హెడ్ కల్పలత, రవికుమార్ మాట్లాడుతూ 11 లెవెల్ కంప్లీట్ చేసిన వారికి, గ్రాండ్ మాడ్యూల్ పూర్తి చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐపి తెలంగాణ స్టేట్ హెడ్ జివి భరత్, ఈస్ట్ తెలంగాణ ఏరియా హెడ్ జి. శ్రీధర్, టీచర్స్ గీత, జోషి, చంద్రకల, నిశిత, శీతల్, ప్రియాంక, సాహితీ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

## టిఆర్ఎస్ మహిళ నేత ఉషారాణి అనారోగ్యంతో మృతి

**ఉప్పల్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ తెలంగాణ జాగృతి నాయకురాలు బోన ఉషారాణి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు పార్టీ నేతలు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తోపాటు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంపల్లి రవీందర్, గుడి మధుసూధన్‌రెడ్డి, కె.జగన్, ఏదుల కొండల్‌రెడ్డి, బింగి శ్రీనివాస్, పుష్పరాజ్, మాస శేఖర్ తదితరులు ఉషారాణి మరణవార్త తెలుసుకుని ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పార్టీ కోసం ఉష చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు రామాంజనేయులు, బాలేందర్, సత్యవతి, అంజలి, కళావతి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## రాజప్పకాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**హాయత్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** హాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని రాజప్పనగర్‌కాలనీలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు దీపావళి శ్రవణ్‌కుమార్, కార్యదర్శి భాగ్యనాయక్ మాట్లాడుతూ...రాజప్ప కాలనీలో సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షం కారణంగా మట్టిరోడ్లు బురదమయంగా మారుతున్నాయని దీంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. కాలనీలో కమ్యూనిటీ హాలు అభివృద్ధితో పాటు సీసీరోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సాధ్యమయినంత త్వరగా అభివృద్ధి పనులను పూర్తిచేసి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు శేఖర్‌రెడ్డి, సునీల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

## నాగార్జున కాలనీలో హరితహారం ప్రారంభం

**వనస్థలిపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు మొక్కలను నాటాలని నా గార్జున కాలనీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు లట్టపల్లి మోహన్‌రెడ్డి, నాయిని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సేవ్‌ఎర్త్ ఫౌం డేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సహకారంతో వనస్థ లిపురం డివిజ న్‌లోని నాగా ర్జున కాలనీలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవ్‌ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మూలకృష్ణగౌడ్, కాలనీ ప్రతినిధులు మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రె డ్డి మాట్లాడుతూ... పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రతి కాలనీలో ఇళ్ల ముందు మొక్కలు నాటాలన్నారు. స్వచ్ఛమైన ప్రాణవాయువు కోసం భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటే కార్యక్రమంలో కాలనీవాసులు భాగస్వాములు కావాలన్నారు. అదేవిధంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ టి.సురేందర్, కాలనీ ప్రధాన కార్యదర్శి గంగాపురం హన్మంతరెడ్డి, హరితహారం సూపర్‌వైజర్లు సుధాకర్, శివకృష్ణ, జయసూర్య పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

## అమ్మవారికి రామ్మోహన్ గౌడ్ పూజలు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** బోనాల జాతర ఉత్సవంలో పాల్గొన్న ఎల్బీనగర్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగొని రామ్మోహన్‌గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా కొత్తపేట ఓల్డ్‌విలేజ్‌లో టీం రుద్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీప్రసన్నమహంకాళి అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు వేడుకలలో పాల్గొనగా నిర్వాహకులు రామ్మోహన్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సాయి, లడ్డు, హరీష్, శివ, ప్రశాంత్, చైతన్య, బాలచంద్ర, శ్రవణ్, వరుణ్, అక్షయ్, భరత్, వికాస్, శ్రీమాన్ పాల్గొన్నారు.

## 14న డ్రాయింగ్ పోటీలు


లోగో ఆవిష్కరిస్తున్న రాముయాదవ్

**మలక్‌పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త :** 75వ స్వతంత్ర భారత దినోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 14వ తేదీన దిల్సుఖ్నగర్లో ఐదు నుంచి 16 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు మెగా డ్రాయింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నార్కట్పల్లి జంగయ్య తెలిపారు. మలక్‌పేటలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాముయాదవ్ డ్రాయింగ్ పోటీలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ మెగా డ్రాయింగ్ పోటీలలో పిల్లలందరూ పాల్గొని బొమ్మల రూపంలో తమ దేశభక్తిని చాటాలని కోరారు. పూర్తి వివరాలకు 9963946447 నెంబర్లు సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ మలక్పేట టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కామేష్, నక్క అమరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## కరాటే పోటీలో హబ్సిగూడ విద్యార్థికి కాంస్య పతకం

**ఉప్పల్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** కియా జపాన్ శాంతోకన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో కెడిఆర్ బిల్డ్ తైక్వాండో అకాడమీ, డ్రాగన్ ఫిస్ట్ శాటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థి హేమంత్‌కు కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ మేరకు మేడ్చల్ సుమంగళిలో జరిగిన కార్యక్రమంలో హబ్సిగూడకు చెందిన విద్యార్థి హేమంత్ కాంస్య పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్లు సత్యశంకర్, దయాకర్, సురేష్‌లు విద్యార్థిని సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు కూడా తగు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలి పారు. క్రీడాకారులకు ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు.


కాంస్య పతకం అందుకున్న విద్యార్థి హేమంత్‌ను అభినందిస్తున్న మాస్టర్లు సత్యశంకర్, సురేష్ తదితరులు

## మీర్‌పేట్‌లో తల్లిపాల వారోత్సవాలు, గర్భిణీలకు సీమంతం


సీమంతం జరిపిస్తున్న కార్పొరేటర్ బిక్షపతిచారి

**సరూర్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 27వ డివిజన్ సిర్లాహిల్స్ అంగన్‌వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్స వాలు, గర్భిణీలకు సీమంత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యతను ప్రతి మహిళ తెలుసుకోవాలని కోరారు. స్థానిక అంగన్‌వాడి కేంద్రంలో మహిళల బరువు కొలిచే వెయిట్ మిషన్ కోసం ఆయన విరాళం అందజేశారు. అంగన్‌వాడి టీచర్ అరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం బాలమణి, ఆశా వర్కర్ కవిత, పలువురు గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## రాజీవ్‌గృహకల్ప సమస్యలు పరిష్కరించాలని వినతి


కార్పొరేటర్ లలితా కృష్ణకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప సమస్యలను పరిష్కరించాలని స్థానిక మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ కార్పొరేటర్ ముత్యాల లలిత కృష్ణను కోరింది. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు కార్పొరేటర్‌కు ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు సమస్యలను వివరించి కాలనలో బస్తీ దవాఖాన, పాడైన రోడ్ల మరమ్మతులు చేయించాలని కోరారు. అదే విధంగా నాలుగు వేల మంది వరకు ఉంటున్న ఈ కాలనీలో పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కథలయ్య, మధుచారి, నాగరాజు, బండి స్వామి, రమేష్, చందు తదితరులు ఉన్నారు.

## మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ రాగిడి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 8 ప్రభాతవార్త :** మహిళలు అర్థికంగా, సామాజికంగా రాణించేందుకు తమ వంతు తోడ్పాటు అందిస్తామని మధురా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నేత రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చిలుకానగర్ డివిజన్‌లో మధురా ట్రస్ట్ ఆధ్వర్యంలో కరిపే సంతోష్‌కు మార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియో జకవర్గం పరిధిలో మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు పూర్తి సహకారం అందిస్తామ్దన్నారు. మహిళ సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రంలో అందిస్తున్న సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొంపల్లి బాలరాజు, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, బూర్గుల రమేష్‌గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పుప్పాల వెంకటేశ్వర్లు, దాసరి కృష్ణ, వంగేటి సంజీవరెడ్డి, షబ్బీర్, భానుగౌడ్, సాయిబాబా, సాయిగౌడ్, బొల్లం లక్ష్మణ్, కావ్య, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణ కేంద్రాన్ని రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

## అర్హులందరూ బూస్టర్ డోసు వేయించుకోవాలి

**సరూర్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** అర్హులందరూ కోవిడ్ వ్యాక్సిన్ బూస్టర్ డోసులు వేయించుకోవాలని మీర్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి కోరారు. డివిజన్‌లోని న్యూ గాయత్రీనగర్ కాలనీ బాడ్మింటన్ మైదానంలో కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా బూస్టర్ డోసు వేయించుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు కాలనీలో నిర్వహించే ఈ కేంద్రాన్ని డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


వ్యాక్సిన్ తీసుకుంటున్న సబితా రాజశేఖర్‌రెడ్డి

## స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేన్

**గన్‌ఫౌండ్రి, ఆగస్టు 8, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఆదేశాల మేరకు భారత స్వాతంత్ర వజ్రోత్సవ వే డుకలను ఘనంగా నిర్వహి స్తున్నట్లు తెలంగాణ టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షు లు డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హు స్సే న్‌లు తెలిపా రు. ఈ మేరకు గోడపత్రిక ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదిన భారత జెండాతోపాటు 800మంది ఉద్యోగులతో కలిసి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీగా వెళ్లనున్నట్లు తెలిపారు. మంత్రులు మహమ్మూద్‌అలీ, వి.శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమాలకర్, కేంద్ర సంఘం అధ్యక్షులు ఎం.రాజేందర్, కార్యదర్శి కె.ప్రతాప్‌లు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, ఉపాధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కోశాధికారి బాలరాజ్, కె.శ్రీనివాస్, ఖలీద్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రను విజయవంతం చేయాలి - జైపాల్‌రెడ్డి

**హాయత్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం 75 సంవత్సరాల స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 9న పెద్దఅంబర్‌పేటలోని గాంధీవిగ్రహం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి పాదయాత్ర ప్రారంభం అవుతుందని పార్టీ పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మీర్‌పేట్‌లో ఆజాదీకా అమృతోత్సవ్ క్రీడా పోటీలు

**సరూర్‌నగర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** క్రీడలతో బాలల వికాసం జరుగుతుందని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్ గౌడ్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా డివిజన్‌లోని చిన్నారులకు కార్పొరేటర్ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా పోటీలను, వ్యాసరచనలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన కార్పొరేటర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులనీ వారిని తీర్చిదిద్దడమే సమాజం బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీంరాజ్, వినయ్, రిచి తదితరులు పాల్గొన్నారు.


క్రీడా పోటీలను నిర్వహిస్తున్న కార్పొరేటర్ అక్కి మాధవి

## నేటి నుండి ఘనంగా రవీంద్రభారతిలో 'భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ద్విసప్తాహం'

**రవీంద్రభారతి, ఆగస్టు 8, ప్రభాతవార్త :** భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ద్విసప్తాహంలో భాగంగా ఈరోజు 9 నుండి 21వ తేదీవరకు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూల్‌ను ఉత్సవ కమిటీ విడుదల చేసింది. ఆ వివరాల్లోకి వెళితే ....

9 మంగళవారం : జాతీయోద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే గురు కళాకృష్ణ బృందం 75మందితో 'వందేమాతరం' పేరిణి నాట్యప్రదర్శన కార్యక్రమంలో ప్రారంభోత్సవం.

10 బుధవారం : గాంధీజీ ఆశయ గీతాలతో జయలక్ష్మి బృందంచే వీణ కచేరి; గురు ప్రమోద్‌కుమార్ రెడ్డి బృందంచే నృత్యాలు.

11 గురువారం : పిడమర్తి క్రాంతి బృందం, రాఘవరాజ్ మంగళభట్ బృందాలతో స్వాతంత్ర్య సమరస్ఫూర్తిని రేకెత్తించే నాట్యప్రదర్శనలు.

12 శుక్రవారం : పద్మశ్రీ ఆనందశంకర్ జయంత్ బృందంచే విశ్వకవి రవీంద్రుని గీతాలలోని దేశభక్తి అంశాలతో 'కావ్యాంజలి' నృత్యనీరాజనం.

13 శనివారం : జాతీయ సమైక్యత గీతాలాపన - 'పాడవోయి భారతీయుడా'.

14 ఆదివారం : ప్రజాదరణ పొందిన దేశభక్తి గీతాల ఆలాపన; 'తల్లి భారతి వందనం' ఆకాశవాణి కళాకారుల బృందంచే.

15 సోమవారం : ప్రభుత్వ సంగీత నృత్యకళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులచే భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పే 'సారే జహాసే అచ్ఛా-హిందూ సితా హమారా' సంగీత నృత్యకార్యక్రమం.

16 మంగళవారం : తెలంగాణ సాహిత్య అకాడమీ సారథ్యంలో 'స్వాతంత్ర్యస్ఫూర్తి వజ్రోత్సవ దీప్తి' అంశంపై కవిసమ్మేళనం.

17 బుధవారం : రామాచారి బృందంచే భారత స్వాతంత్ర్య సమరం భావనలతో పాటల కార్యక్రమం-నాదేశం నమో నమామి.

18, 19 గురు శుక్రవారాలు : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారిచే భారతీయ కళా వైభవం-భిన్నత్వంలో ఏకత్వం-దేశంలోని వివిధ నృత్యకళల సమాహారం.

20 శనివారం : డా. కోట్ల హనుమంతరావు, డా. అనితారావు బృందంచే భారత జాతీయోద్యమ ఘట్టాలపై నృత్యరూపకం 'వందేమాతరం'.

21 ఆదివారం : ప్రముఖ గాయనీమణులు పి.సుశీల, ఎస్.పి.శైలజల సారథ్యంలో సినీ దేశభక్తి గీతాల ఆలాపన 'భారతమాతకు జేజేలు'.